PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 38 | విజయవాడ, సోమవారం 8 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 8 September 2025 | Rs



హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి 10.33 గంటల ప్రాంతంలో చంద్ర బింబం



ముంబయిలో గ్రహణ ప్రారంభవేళ అరుణవర్ణంలో జాబిల్లి హోయలు..



ఆసియా హాకీ కప్ విజేత భారత్

5

అరుణవర్ణంలో చంద్రబింబం.. ఆకాశంలో అద్భుత దృశ్యం

దేశవ్యాప్తంగా సంపూర్ణ చంద్రగ్రహణం

ఆదివారం రాత్రి 11 గంటలకు మొదలు

మేఘావృతంతో పలుచోట్ల నిరాశ

న్యూఢిల్లీ : ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో పాటు అనేక దేశాల్లో చంద్రగ్రహణం కనిపించింది. గ్రహణ ప్రారంభవేళ అరుణవర్ణంలో చంద్రబింబం అలరించింది. తదనంతరం నెమ్మదిగా గ్రహణం విస్తరించడంతో చంద్రహోయలు మరింత శోభతో ఆకట్టుకున్నాయి. అయితే మేఘావృతంతో పలుచోట్ల గ్రహణ వీక్షకులకు తీవ్ర నిరాశ ఎదురైంది. జనవిజ్ఞానవేదిక (జెవివి) వంటి సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు గ్రహణం వేళల్లో దేశవ్యాప్తంగా ఆలయాలన్నింటిని మూసివేశారు. తిరుమల, విజయవాడ, శ్రీశైలం ఆలయ ప్రధాన ద్వారాలకు తాళాలు వేశారు. భారత్‌లో ఆదివారం రాత్రి 9.56 గంటలకు ఇది ప్రారంభమైంది. ఇక రాత్రి 11 గంటలకు 'సంపూర్ణ చంద్రగ్రహణం' మొదలైంది. ఇది తర్వాతి రోజు (సోమవారం) ఉదయం 12.22 గంటలకు ఇదీ వీడనున్నది. అంటే 82 నిమిషాల పాటు పూర్తిగా భూమి నీడలోనే చంద్రుడు ఉండనున్నాడు. అయితే ఈ గ్రహణాన్ని బ్లడ్‌మూన్‌గా పిలుస్తున్నారు. అలాగే సోమవారం ఉదయం 2:25 గంటలకు చంద్రగ్రహణం వీడనున్నది. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపై వచ్చినప్పుడు ఈ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది.

కాగా ఈ చంద్రగ్రహణాన్ని చూసేందుకు పెద్దలు, చిన్నారులు ఆసక్తి కనబర్చారు. టెలిస్కోప్‌ల ద్వారా ఈ దృశ్యాన్ని వారు వీక్షించారు. కాగా నిపుణులు, హేతువాదులు ఈ చంద్రగ్రహణం గురించిన అసలు విషయాలను వివరిస్తూ అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశారు. జెవివి ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడ వంటి నగరాల్లో గ్రహణ సమయంలోనే ఆహారం తీసుకుని యువత శాస్త్ర చైతన్యాన్ని చాటారు. ఆసియా, పశ్చిమ ఆస్ట్రేలియాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం.. ఐరోపా, ఆఫ్రికా, తూర్పు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది.

హైడ్రో ప్రాజెక్టు నిర్మిస్తే ఊరుకోం

దేవరపల్లిలో అధికారులను అడ్డుకున్న ఆదివాసీలు



దేవరపల్లిలో అధికారులను అడ్డుకుంటున్న ఆదివాసీలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)


తమ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించి బతుకులను జలసమాధి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఆదివాసీలు హెచ్చరించారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలం బస్కీ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా నెల రోజులుగా పోరాటం జరుగుతోంది. అయినప్పటికీ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హైడ్రో ప్రాజెక్టు నిమిత్తం ఆదివారం తహశీల్దార్ కుమారస్వామి, అధికారులు పోలీసు బందోబస్తుతో పంచాయతీలోని దేవరపల్లి గ్రామానికి వచ్చారు. విషయం తెలిసి ఆ గ్రామ ఆదివాసీలు తమ సంప్రదాయ ఆయుధాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారిని అడ్డుకున్నారు.

ప్రాజెక్ట్ నిర్మాణం రద్దు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే బస్కీ పంచాయతీలోని దేవరపల్లి, బొండగుడ, ఇరుకుగుడ, పడ్డిగుడ, పిరిపొద్దర్, గొందన, బొంసుగుడ, గొందిగుడ, బస్కీ, జాకరవలస గ్రామాలకు చెందిన పచ్చటి పంట పొలాలు, ఆదివాసీ గ్రామాలు నీట మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం జారీ చేసిన జిఒ 51ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో పీసా కమిటీ, గ్రామసభ తీర్మానం లేకుండా గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వం, అధికారులు అదాని, నవయుగ కంపెనీలతో కుమ్మక్కై గిరిజనుల వేలాది ఎకరాలను ధారాదత్తం చేయాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పంట పొలాలు, కాఫీ తోటలు, వ్యవసాయ భూములు, జీవనాధారమైన కొండలను హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో జల సమాధి చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతో, అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.రమేష్, ఎంపిటిసి సభ్యులు కె.రామన్న, అధిక సంఖ్యలో ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అధికారులు ప్రైవేటు హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం గ్రామాల్లోకి రావడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల ఏజెంట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉపరాష్ట్రపతి ఎన్నిక

బరిలో ఎన్‌డిఎ నుంచి రాధాకృష్ణన్, 'ఇండియా' అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి

నేడు ప్రతిపక్ష ఎంపీలకు మాక్ పోలింగ్



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

భారత ఉపరాష్ట్రపతి ఎన్నికకు రేపు (మంగళవారం) పోలింగ్ జరగనుంది. ఇందులో భాగంగా నేడు (సోమవారం) ప్రతిపక్ష ఎంపీలకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై సోమవారం ప్రతిపక్ష ఎంపీలకు వివరించనున్నారు. ఆ తర్వాత సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 'మాక్ పోల్' నిర్వహిస్తారు. రాత్రి 7.30 గంటలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రతిపక్ష ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. సెప్టెంబర్ 9న జరిగే ఎన్నికల్లో అధికార ఎన్డీఏ అభ్యర్థి సిపి రాధాకృష్ణన్, ఇండియా బ్లాక్ ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి మధ్య ప్రత్యక్ష పోటీ జరగనుంది.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రెటరీ జనరల్ పిసి మోడీ మాట్లాడుతూ మంగళవారం పార్లమెంట్ హౌస్‌లోని వసుధలోని రూమ్ నెంబర్ ఎఫ్-101లో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. "ఓట్ల లెక్కింపు అదే రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుంది. ఆ తరువాత వెంటనే ఫలితం ప్రకటిస్తారు" అని రాజ్యసభ సెక్రెటేరియట్ తెలిపింది. పార్లమెంట్ హౌస్‌లో పోలింగ్ ఏర్పాట్లను ఉపరాష్ట్రపతి ఎన్నిక రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రెటరీ జనరల్ పిసి మోడీ చేస్తున్నారని వివరించింది. ఉపరాష్ట్రపతికి జరిగే ఎన్నికల్లో పార్లమెంటు ఉభయ సభల సభ్యులు ఓటు వేయనున్నారు. 17వ ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీలో రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు (ప్రస్తుతం

మిగతా 7లో



10న సూపర్ సిక్స్ విజయోత్సవ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురంలో ఈ నెల 10న 'సూపర్ సిక్స్-సూపర్ సక్సెస్' రాష్ట్రస్థాయి విజయోత్సవ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టిడిపి వెల్లడించింది. నగరంలోని ఇంద్రప్రస్థనగర్‌లో ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరుకానున్నట్లు తెలిపింది. సూపర్ సిక్స్ పథకాలతో రూ.లక్ష కోట్లకుపైగా నిధులు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో ప్రజలకు చేరిందని పేర్కొంది. 15 నెలల కిందట అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా నిర్ణయాలు అమలు చేసిందని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే పెంచిన పెన్షన్లు అమలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారని పేర్కొంది. ఈ క్రమంలో సూపర్ సిక్స్‌లో హామీలు ఒక్కొక్కటీ అమలు చేస్తూ ముందుకు సాగినట్లు వెల్లడించింది. సూపర్ సిక్స్-సూపర్ సక్సెస్ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు, టిడిపి, జనసేన, బిజెపి ముఖ్యనాయకులు పాల్గొంటారని పేర్కొంది.

జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా



టోక్యో : జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఈ విషయాన్ని ఇషిబా స్వయంగా ప్రకటించారు. సొంత పార్టీ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిడి ఈ కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి పార్టీ నేతల ఈ ఒత్తిడి పెరిగింది. గతేడాది అక్టోబర్‌లో ఇషిబా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) అధ్యక్ష ఎన్నికల్లో ఇషిబా విజయం సాధించి ప్రధానిగా పదవిలోకి వచ్చారు. అయితే, ఈ జులైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువ సభలో అధికార సంకీర్ణ ప్రభుత్వం మెజార్టీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికల నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు ఎల్‌డిపి సోమవారం నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకోవడానికి ప్రక్రియ ప్రారంభిస్తానని, సోమవారం నిర్ణయం అవసరం లేదని చెప్పారు. మరోవైపు ఇషిబా రాజీనామాతో ఎల్‌డిపి తన పార్టీ అధ్యక్ష ఎన్నికలకు తేదీని నిర్ణయించనుంది. ఈ ఎన్నిక అక్టోబర్ ప్రారంభంలో జరిగే అవకాశం ఉంది. అయితే ఉభయ సభల్లో మెజార్టీ లేకపోవడంతో తదుపరి ఎల్‌డిపి నాయకుడు బిల్లులను ఆమోదించడానికి ప్రతిపక్ష పార్టీలతో కలిసిపనిచేయాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అలాగే అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కానీ జపాన్‌లో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ఒక కూటమిని ఏర్పాటు చేయలేనంతగా చీలిపోయి ఉన్నాయి.

చికాగోలో చెలరేగిన నిరసనలు

- దేశ బహిష్కరణ చేస్తానంటూ ట్రంప్ బెదిరింపులు
- నిరసనగా హోరెత్తిన వీధులు

7లో

పిజి కోర్సుల్లో ప్రవేశాలకు

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర ఉన్నత విద్యామండలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు అందించే పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదివారం విడుదల చేసింది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ రెండు దశల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి దశ కన్వీనరు కోటాలో ప్రవేశాల కోసం వెబ్‌కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుము చెల్లింపులు ఈ నెల 8 నుంచి 15 వరకు చేసుకోవచ్చన్నారు. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఈ నెల 9 నుంచి 16 వరకు, వెబ్ ఆప్షన్ల నమోదు 12 నుంచి 17 వరకు, వెబ్‌ఆప్షన్ల మార్పు 18న, సీట్లు కేటాయింపులు 20న లిస్టులు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 22 నుంచి 24లోగా రిపోర్టింగ్ చేసుకోవాలని తెలిపారు. 22 నుంచి కళాశాలల్లో తరగతులకు విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కోల్‌కతాలో మరో దారుణం

పుట్టిన రోజున యువతిపై అఘాయిత్యం

పరారీలో ఇద్దరు నిందితులు



నిందితులు దీప్ బిశ్వాస్, చందన్

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆర్‌జికర్ ఆసుపత్రిలో హత్యాచారం, ఓ న్యాయ విద్యార్థినిపై లైంగికదాడి ఘటనన మరవకముందే.. కోల్‌కతాలో మరో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఓ యువతిపై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. యువతి పుట్టిన రోజున సెలబ్రేట్ చేసుకుందామని ఓ ఇంటికి తీసుకెళ్లి ఈ దారుణానికి తెగబడ్డారు. యువతి ఫిర్యాదుతో నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోల్‌కతాలో హరిదేవ్‌పురాకు చెందిన 20 ఏళ్ల యువతి ఆమె పుట్టిన రోజునే అఘాయిత్యానికి గురయ్యింది. యువతికి పరిచయం ఉన్న ఇద్దరు యువకులు ఆమెను బర్త్‌డే పార్టీ పేరిట ఓ ఇంటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆ యువతిపై దారుణానికి పాల్పడ్డారు. కోల్‌కతా నగర శివారులోని రీజెంట్ పార్క్ ప్రాంతంలో శుక్రవారం ఈ దారుణం జరిగింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను చందన్ మాలిక్, దేబాంగ్షు బిశ్వాస్ ఎలియాస్ దీప్‌గా గుర్తించారు. దీప్ ప్రభుత్వ ఉద్యోగి అని కూడా తెలుస్తోంది. యువతి పుట్టిన రోజు సందర్భంగా చందన్ మాలిక్ ఆమెను బర్త్‌డే సెలబ్రేట్ చేసుకుందామని నమ్మించి దీప్ ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత అక్కడ వారు భోజనం చేశారు. అనంతరం బాధితురాలు తన ఇంటికి వెళ్లడానికి సిద్ధమైంది. కానీ నిందితులు ఆమెను అడ్డుకున్నారు. గదిలో బంధించి దారుణానికి ఒడిగట్టారు. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు తన ఇంటికెళ్లి కుటుంబసభ్యులకు జరిగిన దారుణం గురించి తెలిపింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాష్ట్రంలో వరుస ఘటనలు

రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు వరుసగా చోటు చేసుకోవటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 25న ఓ న్యాయ విద్యార్థి లా కాలేజీ క్యాంపస్‌లోనే లైంగికదాడికి గురైన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే.

ఈ కేసులో కోల్‌కతా పోలీసులు అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విద్యార్థి నాయకుడు మోనోజిత్ మిశ్రాతో పాటు మరో ముగ్గురికి వ్యతిరేకంగా చార్జిషీట్‌ను కూడా నమోదు చేశారు. గతేడాది ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్‌జికర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఓ డాక్టర్‌పై హత్యాచారం జరగటం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన విషయం విదితమే.

ఏం మాయ చేశాడో..!

బి తులసీదాస్

'చైనా చీకటి వలయంలో భారతదేశం చిక్కుకుపోయిందని' శుక్రవారం నాడు విమర్శలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని గంటలు గడిచాక శనివారం నాడు మాటమార్చి 'భారత అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని' పేర్కొన్నారు. 'మోడీ గొప్ప ప్రధానమంత్రి' అని కొనియాడారు. అంతే.. ట్రంప్ మాటలు మీడియాలో వచ్చీరాగానే మన ప్రధాని మోడీ ' ట్రంప్ భావాలను, భారత్ అమెరికా సంబంధాలపై ఆయన సానుకూల దృక్పథాన్ని అభినందిస్తున్నాని' ఎక్స్ వేదికగా ప్రకటించేశారు. మన సరుకులపై 50 శాతం సుంకాలు విధించి, మన దేశ రైతులను, కార్మికులను కన్నీరు పెట్టిస్తూ, విద్యార్థి యువజనుల ఆశలు అడియాసలు చేస్తున్న ట్రంప్ గురించి ప్రధాని మోడీకి అంత 'సానుకూలత' ఎందుకో? భారత సరుకులపై ఏకపక్షంగా విధించిన అధిక సుంకాల ఎత్తివేత లేదా కనీసం తగ్గింపు గురించి అసలు ప్రస్తావించకనేపోయినా 'మోడీ గొప్ప ప్రధాని' అని కితాబివ్వడంతోనే ట్రంప్ పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రంప్ 'ఏం మాయ చేశాడో..!' అని జనం అనుకుంటున్నారు. కానీ అసలు కారణాలు వేరే వున్నాయి.

జియో పొలిటికల్ వ్యూహాలు

గత వారం షాంఘైలో జరిగిన ఎస్‌సిఓ సదస్సు సందర్భంగా చైనా, భారత్, రష్యా దేశాల అధినేతలు కలుసుకోవడం, ముగ్గురూ ముచ్చటించుకోవడం, ఇద్దరేసి అధినేతలు విడిగా వన్ టు వన్ చర్చించడం ప్రముఖ అంతర్జాతీయ పరిణామంగా గణుతికెక్కింది. బ్రిక్స్ సదస్సు జరిగిన కొద్ది వారాలకే ఈ పరిణామం సంభవించింది. ఈ క్రమంలోనే ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం 80వ వార్షికోత్సవం సందర్భంగా చైనా తన సైనిక పాటవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఆ సందర్భంలో చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాధినేతలు ఒక వేదికపై నిలిచారు. ఈ పరిణామాలన్నిటినీ క్రమ పద్ధతిలో పరిశీలిస్తే ఇప్పుడున్న ప్రపంచ బలాబలాల్లో మార్పులకు దారి తీస్తున్నట్టు స్పష్టమవుతోంది. తొలుత భారత రష్యాలను చైనాకు వదిలేశామనీ, ఆ తరువాతి రోజు రష్యా, చైనా, ఉత్తర కొరియా తమపై కుట్ర చేస్తున్నాయన్న ట్రంప్ మాటల్లోనే ఈ విషయం వ్యక్తమయ్యింది. ఏకపక్ష ధోరణులతో ముందుకురుకుతున్న అమెరికాకు ముకుతాడు వేసేలా బహుళ ధృవ ప్రంచం దిశగా సాగుతున్న ఈ పరిణామాలతో ట్రంప్ షాక్ తిన్నాడు. చైనా పలుకుబడి, ప్రభావాలను తగ్గించడం అమెరికా లక్ష్యం. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల స్నేహంగా వున్నప్పటికీ రష్యా చారిత్రకంగా అమెరికాకు శత్రు దేశం. కాబట్టి భారత్‌ను (మోడీని) 'మచ్చిక' చేసుకోవాలనే దుర్బుద్ధితోనే ఈ వ్యాఖ్యలు చేశారన్నది నిర్వివాదాంశం. ఇది ముమ్మాటికీ అమెరికా జియో పొలిటికల్ వ్యూహంలో భాగమే!

దేశీయంగానూ ట్రంప్ సర్కారుపై ఒత్తిడి పెరుగుతోంది. సుంకాలపై కోర్టులు ఉత్తర్వులిచ్చాయి. తాజాగా సుప్రీం కోర్టులో 250 పేజీల అఫిడవిట్‌తో ట్రంప్ ప్రభుత్వం బుధవారంనాడు అపీల్ చేసింది. భారత్‌తో 27 సంవత్సరాలుగా నిలకడైన వాణిజ్యం సాగుతోందనీ ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంతో గిల్లి కజ్జాలు తెచ్చుకోవద్దని అమెరికా పౌర సమాజం చర్చిస్తోందని మీడియా కథనాలు వచ్చాయి. కనుక ఇంటా బయటా ఒత్తిళ్లతోనే ట్రంప్ మాట మార్చారు.

సుంకాల సంగతేమిటి?

ట్రంప్ వ్యూహం సరే కానీ మోడీ మహాశయుని సానుకూల వ్యాఖ్యల మాటేమిటి? సుంకాల తగ్గింపు గురించి గానీ వినాశకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి కానీ మాట మాత్రం కూడా ప్రస్తావించకపోయినా ట్రంప్ భావాలు... అమెరికాతో సంబంధాలు అంటూ మోడీ ఎందుకంతలా మురిసిపోయారు? అంటే దేశ ప్రయోజనాలు ఏమైపోయినా 'మోడీ గొప్ప ప్రధాని' అన్న మాటలతోనే పరవశించిపోతారా? ఇవీ సగటు భారతీయుల ప్రశ్నలు.

ట్రంప్ ఏప్రిల్ 5న ప్రపంచ దేశాలన్నిటిపైనా దిగుమతి సుంకాలు అపరిమితంగా పెంచాడు. ఆ తరువాత ఏప్రిల్ 9న మరికొన్ని ఎంపిక చేసుకున్న దేశాలపై మరింత అదనపు సుంకాలు విధించాడు. గట్టిగా ప్రతిఘటించిన చైనా, మెక్సికో వంటి దేశాలతో దారికివచ్చి సుంకాలు తగ్గించక తప్పలేదు. అయితే, మన దేశంపై మాత్రం అంతకంతకూ సుంకాలు పెంచే వైఖరి కొనసాగిస్తోంది. భారత్ నుండి దిగుమతయ్యే టెక్స్‌టైల్స్, దుస్తులు, రొయ్యలు, చేపలు ఇతర సముద్ర ఉత్పత్తులు, లెదర్, వజ్రాభరణాలు.. ఇలా అన్నిటిపైనా ట్రంప్ ప్రభుత్వం సుంకాలు పెంచింది. గతంలో 2.5 శాతం ఉన్న సుంకాలను 50 శాతానికి పెంచింది. దాదాపు లక్ష కోట్ల రూపాయల భారత ఎగుమతులపై ప్రభావం పడుతుందని అంచనా. జిడిపి వృద్ధి రేటు క్షీణిస్తుందని ఆర్థికవేత్తలు నిర్ధారించారు.

సందట్లో సడేమియా

వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై మన దేశం విధిస్తున్న సుంకాలను ఎత్తివేయించి భారతీయ మార్కెట్లను అమెరికా దిగుమతులతో నింపేయాలన్న ఎత్తుగడతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం గత ఏడాది కాలంగా అమెరికా ముమ్మర యత్నాలు చేస్తున్నది. దాంతో మన దేశ వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తుల ధరలు పడిపోతాయి. అంతేగాక జన్యు మార్పిడి విత్తనాలతో మన వ్యవసాయ రంగాన్ని అతలాకుతలం చేయాలన్న కుట్ర కూడా దాగివుంది. మోడీ ప్రభుత్వం పార్లమెంటునుగానీ, రాష్ట్రాలను గానీ విశ్వాసంలోకి తీసుకోకుండా అమెరికాతో ఒప్పందాలకు అడుగులు వేసింది.

రష్యా నుండి చమురు కొనుగోళ్లు ఆపేయాలని అమెరికా ఒత్తిడి చేస్తున్నా కొనసాగిస్తూనేవున్నాం కదా! అని కొందరంటారు. 'ప్రపంచంలో ఎక్కడ చౌకగా దొరికితే అక్కడే ఆయిల్ కొంటాం' అని మన విదేశాంగ శాఖ కార్యదర్శి ఏనాడో వివరించారు. కాబట్టి రష్యా నుండి చమురు కొనుగోలు మన దేశ వాణిజ్య ప్రయోజనాల కోసమేనన్నది స్పష్టం. అంతేగాక రష్యా చమురును భారత్‌లో శుద్ధి చేసి, ఇతర దేశాలకు అమ్మి భారీగా లాభాలు మూటకట్టుకుంటున్నది అంబానీ వంటి దేశీయ కార్పొరేట్లు!

ఆత్మగౌరవం మాటేమిటి?

ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి స్వదేశానికి పంపితే మోడీ ప్రభుత్వం కిమ్మనకుండా ఉండిపోయి దేశ ప్రతిష్టను దిగజార్చింది. వీసా నిబంధనలు కఠినతరం చేయడం, అమెరికాలో ఏ కోర్సులు చదవొచ్చు, ఎంత కాలం ఉండొచ్చు, అక్కడ రోజువారీగా ఎలా వ్యవహరించాలి వంటి అనేక విషయాల్లో విషమ షరతులు విధించడంతో ఉన్నత చదువులు చదివేందుకు అమెరికాకు పోవాలన్న ఎంతోమంది విద్యార్థుల ఆశలు అడియాసలవుతున్నాయి. ఇటువంటివేవీ మారకుండానే అమెరికాపట్ల జిమ్మిక్కులకు పాల్పడడం ప్రధానికి తగదు. మన దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుకునేందుకు స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించాలి. వాణిజ్య యుద్ధానికి అడ్డుకట్ట వేయాలి. అంతేతప్ప ప్రధాని మోడీ తగుదునమ్మా అంటూ ట్రంప్‌ను ప్రశంసలతో ముంచెత్తితే కుదరదు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- విద్యార్థులపై పోలీసుల దాడి హేయం
- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్ఎఫ్ఐ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన విద్యార్థులపై ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పేర్కొంది. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్, కె ప్రసన్నకుమార్ మాట్లాడారు. కూటమి 15 నెలల పాలనలో విద్యార్థుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఇప్పటికే మండల, జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. విద్యాశాఖ మంత్రికి విన్నవించుకునేందుకు వెళ్తున్న విద్యార్థులపై, ముఖ్యంగా మహిళా విద్యార్థులపై తీవ్రమైన దాడి చేయడం దుర్మార్గమన్నారు. పోలీసుల దాడిలో కావ్య అనే విద్యార్థికి చెయ్యి విరిగిందని, ముగ్గురు విద్యార్థినులు స్పృహ తప్పి పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదంటూ ప్రభుత్వం జిఓ ఇచ్చిందని, ఇది విద్యార్థుల ప్రాథమిక హక్కులను కాలరాయడమే అని తెలిపారు. ఈ నెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. పోలీసుల కర్కశానికి ఏడుగురు విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని, విజయవాడలో విద్యార్థుల ర్యాలీకి అనుమతులు ఎందుకు ఇవ్వరన్నారు. మీడియా సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉష, మాధవ్, షణ్ముఖ్, జశ్వంత్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ఎంపీలందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలి

- ఎఐపిఎస్ఒ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ఎంపిలందరూ విపక్షాలు బలపర్చిన అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఒ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనరు మహంకాళి సుబ్బారావు, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు ఎన్ నరసింహులు, తుంగ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మెట్రో టెండర్ల గడువు పొడిగింపు

- మెట్రో ఎమ్‌డి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, విశాఖ మెట్రో రైల్ టెండర్లకు గడువును పెంచినట్లు ఎపి మెట్రో రైల్ కార్పొరేషన్ ఎమ్‌డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ మెట్రో టెండర్ల గడువు అక్టోబరు 14 వరకు, విశాఖ మెట్రో టెండర్ల గడువు అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు తెలిపారు. టెండర్ల ప్రీ బిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థల నుంచి వచ్చిన వినతుల పరిశీలన కోసం గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విశాఖ మెట్రో రైల్ ఫేజ్-1 కింద 46.23 కిలోమీటర్లు తొలిదశ నిర్మాణానికి టెండర్లు పిలిచామని, విజయవాడ మెట్రో రైల్ ఫేజ్-1లో 38 కిలోమీటర్లు నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఎక్యూసిసి) అనుబంధ కార్యక్రమాలకు అపెక్స్ కమిటీ, నిపుణుల కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్‌శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నై ఐఐటి డైరెక్టర్ వి కామకోటి ఛైర్మన్‌గా 13 మంది ఈ రంగంలోని నిపుణులతో అపెక్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా ఐటిఇ అండ్ సి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వ్యవహరించనున్నారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ ఛైర్మన్‌గా మరో 12 మందితో నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా ఐటిఇ అండ్ సి శాఖ ప్రత్యేక కార్యదర్శి బి సుందర్ వ్యవహరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు గ్లోబల్ కాపాబిలిసి సెంటర్ (జిసిసి) సలహా మండలిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం మరో జిఓను ఐటిఇ అండ్ సి కార్యదర్శి కాటంనేని భాస్కర్ విడుదల చేశారు. ఈ సలహా మండలి ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై జిసిసి విధానాల అమలుపై సమీక్షించడంతోపాటు, తన సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన మరో 10 మందితో ఈ సలహా మండలిని నియమించారు.

ఉల్లి రైతులపై కేసులు

- పోలీసుల తీరుపై అన్నదాతల ఆగ్రహం
- మద్దతు ధరతో పంట మొత్తం కొనాల్సిందేనని డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ / కర్నూలు కార్పొరేషన్, సి బెళగల్

ఆరుగాలం కష్టించి పడించిన పంటకు కనీసం సాగు ఖర్చులు కూడా రాకపోవడంతో సమస్యల వలయంలో చిక్కుకొని మరో మార్గం లేక కర్నూలు జిల్లాలో ఆత్మహత్యకు యత్నించిన ఉల్లి రైతులపై పోలీసులు కేసులు పెట్టారు. ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించకపోతే ..ఆత్మహత్యలే శరణ్యమని సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసి..రైతులు కృష్ణ, వెంకటనాయుడు బలవన్మరణానికి యత్నించిన సంగతి తెలిసిందే. మద్దతు ధర సంగతి అటుంచితే.. ఆత్మహత్యాయత్నం నేరమని పేర్కొంటూ ఈ ఇద్దరు రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని సి బెళగల్ ఎస్ఐ పరమేష్ తెలిపారు. పోలీసుల తీరుపై రైతు సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మద్దతు ధర కల్పించకుండా రైతులపై వేధింపులకు దిగడం సరికాదని పేర్కొన్నాయి.

ఇప్పటికే అప్పుల ఊబిలో చిక్కుకుపోయి..ఎంతో ఆశతో సాగు చేసిన పంటకు కనీస మద్దతు కూడా కల్పించకపోవడంతో సమస్యల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం సరికాదని హితవు పలికాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఉల్లి పంట మొత్తాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశాయి.



ఉల్లిమార్కెట్‌తో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఇతర ఉన్నతాధికారులు

ఆత్మహత్యలు వద్దు.. మద్దతు కల్పిస్తాం : కలెక్టర్ రంజిత్ బాషా

ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం, రైతుల ఆందోళన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి రైతులకు భరోసా కల్పించేందుకు యత్నించారు. ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని, మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిని రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం దాదాపు 31 వేల ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారన్నారు. 1.50 లక్షల టన్నుల ఉల్లి పంట దిగుబడి వస్తుందన్నారు. ఇప్పటికే మార్క్‌ఫెడ్, మార్కెట్ యార్డుల వ్యాపారుల ద్వారా 11,174 టన్నులు, మార్క్‌ఫెడ్ ద్వారా 1,226 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేశామని తెలిపారు.

టెండర్ ప్రక్రియ యథావిధిగా జరుగుతుందని, టెండరులో రూ.1200 కంటే తక్కువ ధర వస్తే, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ద్వారా రైతులకు బోనస్ రూపంలో ఇస్తుందని వివరించారు. ఇదే సమావేశంలో జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని అన్నారు. గత బోనస్ ఇంతవరకు ఇవ్వలేదని, ఇప్పుడెలానమ్మాలని జర్నలిస్టులు ప్రశ్నించగా..ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చినందుకే చెబుతున్నామన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి, చిన్న పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలు విడుదల చేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి, చిన్న పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ ప్రవేశపెట్టిందని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని లక్ష్యంగా ప్రకటించిందన్నారు. అయితే, ఇప్పటికే చిన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. కొన్ని పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న చిన్న పారిశ్రామిక రంగానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించిన ప్పటికీ అమలు కాకపోవడం, ఆలస్యం కావడం జరుగుతోందని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన ప్రోత్సహకాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత నాలుగేళ్లుగా రాయితీల విషయంలో తీవ్ర జాప్యం జరగడం వల్ల అనేక పరిశ్రమలు మూసివేత దశలోకి వెళ్లి, వందలాది మంది చిన్న పారిశ్రామిక వేత్తలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి పారిశ్రామికవేత్తల బ్యాంకు ఖాతాలు ఎన్‌పిఎలుగా మారుతున్నాయని వెల్లడించారు. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ వీరికి రాయితీల సొమ్ము విడుదల కాలేదన్నారు. ప్రోత్సాహకాల కింద మొత్తం పరిశ్రమలకు రూ.12 వేల కోట్లు రాయితీ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు దాదాపు రూ.650 కోట్లు వరకూ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం వీటిని విడుదల చేయలేదని, ఈ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకూ చెల్లించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దీంతో పరిశ్రమలు నడపడం వీరికి తీవ్ర కష్టతరమవుతోందని వెల్లడించారు. బ్యాంకుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు వడ్డీలు పెరిగిపోతున్నాయని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

పర్యాటక కేంద్రంగా రాష్ట్రం

- ఎపిటిడిసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంతో, రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హెలి టూరిజం, టెంట్ సిటీల అభివృద్ధి, హోమ్ స్టేలు వంటి వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) పేర్కొంది. పర్యాటకాభివృద్ధి కోసం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఇవి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పర్యాటకశాఖ, ఇఇఎస్ఎల్ అనుబంధ సంస్థ కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎపిటిడిసి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం హోటళ్లను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించింది. విశాఖపట్నం, తిరుపతిలో ప్రపంచ స్థాయి హోటళ్లను ఏర్పాటు చేయడానికి ఒబెరాయ్, మేఫెయిర్, ఐఆర్‌సిటిసి వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపింది. వచ్చే నాలుగేళ్లలో పర్యాటక ప్రాజెక్టుల్లో 20 వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- సాధారణ స్థితికి గోదావరి
- ధవళేశ్వరం వద్ద 9.20 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,24,445 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 48,906 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి డ్యామ్ మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 82,986 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 884.30 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 32 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2824 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 39,320 క్యూసెక్కుల నీటితో 16.935 మిలియన్ యూనిట్లను, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 30,702 క్యూసెక్కులతో 15.329 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 60,078 క్యూసెక్కులు, శ్రీశైలం మూడు గేట్ల ద్వారా కలిపి దిగువ నాగార్జునసాగర్‌కు 1,49,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం మూడు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

గోదావరి వరద ఆదివారం నాటికి సాధారణ స్థితికి చేరుకుంది. భద్రాచలం వద్ద ప్రస్తుతం 28 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9.20 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 6,51,488 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి వరద తగ్గుముఖం పట్టినా కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉంది. దీంతో 12 గిరిజన గ్రామాల ప్రజలు గత మూడు వారాల నుంచి మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలేరుపాడు రూరల్ మండలం యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వే నీట మునిగే ఉండడంతో ఎడవల్లి, సిద్ధారం, టేకూరు, కోయిదా, తాళ్లగొంది, పూచి గొంది తదితర 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



మూసివేసిన తిరుమల శ్రీవారి ఆలయం



దుర్గమ్మ ఆలయాన్ని మూసివేస్తున్న వైదిక కమిటీ

12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేత

- పలు ప్రముఖ దేవాలయాలూ మూత
- సంపూర్ణ చంద్రగహణం ఎఫెక్ట్

ప్రజాశక్తి- తిరుమల

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఛైర్మన్, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి సమక్షంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ద్వారాలకు అర్చకులు, సిబ్బంది తాళాలు వేశారు. ఏకాంతసేవ అనంతరం ముందుగా బంగారు వాకిలికి తాళం వేశారు. గ్రహణం కారణంగా 12 గంటల పాటు ఆలయం మూసివేసి సోమవారం తెల్లవారు జామున మూడు గంటలకు తెరవనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. శుద్ధి, పుణ్యాహవచనం తరువాత ఏకంతంగా నిత్యసేవలు నిర్వహించిన అనంతరం యాత్రికులను అనుమతిస్తామని, సర్వదర్శనం యాత్రికులకు సోమవారం వేకువజామున రెండు గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించనున్నామని చెప్పారు. శ్రీవారి ఆలయంతో పాటు లడ్డూ, అన్నప్రసాద కేంద్రాలను కూడా మూసివేసినట్లు తెలిపారు. టిటిడి స్థానికాలయాలైన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయం, కోదండరామస్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నారాయణ వనం, కార్వేటినగరం , ఒంటిమిట్ట, అమరావతి ఎస్‌వి ఆలయం తదితర టిటిడి ఆలయాల తలుపులు మూసివేశారు. గ్రహణ సమయంలో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మూసివేయకుండా విశేష పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

నంద్యాల జిల్లా శ్రీశైలం ఆలయ ద్వారాలను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ద్వారాలు తెరవనున్నట్లు ఇఒ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అహోబిలం, మహానంది, యాగంటి దేవస్థానాల తలుపులను సైతం మూసివేశారు. విజయవాడ దుర్గమ్మ ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలన్నింటినీ మూసివేసినట్లు, సోమవారం పునః ప్రారంభమై, యథావిధిగా దర్శనాలు జరగనున్నాయని ఇఒ శీనా నాయక్ తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం దారుణం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



అవినీతి, దోపిడీ కోసం టిడిపి కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం దారుణమని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలోని మరే రాష్ట్రంలోనూ మెడికల్ కాలేజీలను ఇలా ప్రైవేటుపరం చేయడం లేదని తెలిపారు. విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసి ఉసురు పోసుకోవద్దని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలందరూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి ఏకంగా కేబినెట్‌లోనే నిర్ణయం తీసుకున్న విషయంపై ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. రైతులకు బస్తా యూరియా ఇవ్వడం కూడా ప్రభుత్వానికి చేతగావడం లేదని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన చేపడతామన్నారు. ఎపిలో ముమ్మాటికి యూరియా కొరత ఉందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు వ్యాఖ్యలు దారుణమన్నారు. కేంద్రంలోని బిజెపితో పొత్తులో ఉన్నందున పార్లమెంటులోనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపివేస్తున్నట్టు బాబు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే ఉక్కు పోరాటం ఆగుతుందన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, ఎంఎల్‌సి కుంభా రవిబాబు, మాజీ ఎంఎల్‌ఎ ఎ.జోగారావు పాల్గొన్నారు.



గాయపడిన గ్రామస్తులను పరామర్శిస్తున్న స్థానిక నాయకులు

క్వారీ యాజమాన్యం దౌర్జన్యం

- గ్రామస్తులపై దాడి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- బాధితులపైనే కేసులు నమోదు

ప్రజాశక్తి- వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)

తమ గ్రామ సమీపంలో క్వారీ నిర్వహించొద్దన్నందుకు క్వారీ యాజమన్యమూ దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలో చోటు చేసుకుంది. కొమరగుంట పంచాయతీ బందరాళ్లపల్లిలో గ్రానైట్ క్వారీ అనుమతుల విషయంగా గత కొంతకాలంగా స్థానికులు, క్వారీ యాజమాన్యం మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన శిల్ప పేరు మీద క్వారీ నిర్వహణకు అనుమతులు వచ్చాయని, సదరు శిల్ప బంధువు యుంగధర్ నాయుడు.. క్వారీకి దారి వేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారిపై క్వారీకి చెందిన కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఐదుగురు గ్రామస్తులు తీవ్రంగా మరికొంత మంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కొమరగుంట పంచాయతీ బందరాళ్లపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ... తమ గ్రామంలో సుమారు 20కి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, అందరమూ వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. క్వారీ పనులు ప్రారంభిస్తే చుట్టూ కంచె వేసి దారిని మూసివేస్తారని, మేత కోసం మూగజీవాలను అడవిలోకి తీసుకువెళ్లడం సాధ్యం కాదని తెలిపారు. క్వారీ నిర్వహణ వలన తమ పంట పొలాలు కూడా నాశనం అవుతాయన్నారు. క్వారీకి అనుమతులు ఇవ్వొద్దని పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని, దీంతో తామే పనులను అడ్డుకున్నామని చెప్పారు. అయితే క్వారీకి చెందిన యుంగధర్ నాయుడు తిరుపతి నుంచి పది మంది రౌడీలను తీసుకువచ్చి తమపై దాడి చేయించారని తెలిపారు. పోలీసులు మాత్రం తమ గ్రామానికి చెందిన 25మంది పైన అన్యాయంగా కేసులు పెట్టారని వాపోయారు. గ్రామస్తులపై దౌర్జన్యం చేసిన గ్రానైట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు.



నిర్మాణాల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయండి

- రాజధాని నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని నిర్మాణ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థల ప్రతినిధులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కోరారు. తుళ్లూరు మండలం నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారుల టైప్ -1, టైప్-2 ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై సిఆర్‌డిఎ ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొంతమంది నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. కొన్ని భవనాల స్లాబ్, ఇతర పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో చెబితే కొబ్బరికాయ కొడతానంటూ కొంత అసహనం వ్యక్తం చేశారు. ఏయే నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... అమరావతిలో గెజిటెడ్, గ్రూప్ - డి అధికారుల కోసం మొత్తం 14 టవర్స్‌లో 1440 ఇళ్ల నిర్మిస్తున్నామని, టైప్-1లో 384, టైప్-2 లో 336 ఇళ్లు, గ్రూప్-డి అధికారుల కోసం 720 ఇళ్ల నిర్మిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 31 లోగా అన్ని టవర్లను పూర్తిచేస్తామన్నారు. వచ్చేఫిబ్రవరి ఒకటికల్లా నిర్మాణాలు పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఐఎఎస్ అధికారుల టవర్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, మొత్తం 4,400 ఇళ్లలో 3,750 ఇళ్లను వచ్చే మార్చి నాటికి అధికారులకు, ఉద్యోగులకు అప్పగిస్తామని చెప్పారు. ఏడాదిలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లే అవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లను పూర్తి చేస్తామని తెలిపారు. అమరావతి గురించి ఎసి గదుల్లో కూర్చుని కొంతమంది ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, అమరావతి మునిగిపోయిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో మిగిలిన కొద్ది భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు అథారిటీ ఆమోదించిందన్నారు. భూసేకరణ కంటే భూసమీకరణ వల్ల రైతులకు ఎక్కువ లాభమని అభిప్రాయపడ్డారు.

త్వరలో 2 ఎంసిహెచ్ బ్లాక్‌లు సిద్ధం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గర్భిణులు, నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు త్వరలో రెండు ఎంసిహెచ్ (మదర్ అండ్ చైల్డ్ కేర్) బ్లాక్‌లు గుంటూరు, కాకినాడ జిజిహెచ్‌లలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ బ్లాక్‌లలో వైద్య సేవలు అందించేందుకు రూ.51.33 కోట్లతో పరికరాలు, సామగ్రి కొనుగోలు చేయడానికి అనుమతినిచ్చినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జిజిహెచ్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.86 కోట్లతో నిర్మిస్తున్న ఎంసిహెచ్ బ్లాక్ త్వరలో పూర్తి కానుందని, దీనిలో 500 పడకలు, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.46 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న మరో ఎంసిహెచ్ బ్లాక్ పూర్తి కావచ్చిందన్నారు. ఈ బ్లాక్‌లోనూ మరో 500 పడకలతో సేవలందిచేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. ఈ రెండు బ్లాక్‌లలో రూ.51.33 కోట్ల వ్యయంతో 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు, సామగ్రిని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

ప్రతియేటా సెప్టెంబరు 8న ఫిజియోథెరపీ డేను జరుపుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది వృద్ధాప్యం - ఆరోగ్యం నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజియో థెరపిస్ట్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

తురకపాలెంలో కొనసాగుతున్న పరీక్షలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రజలకు వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం దాదాపు 300 ఇళ్ల నుంచి 800 మంది వద్ద రక్తనమూనాలు సేకరించారు. ఎయిమ్స్ నుంచి వచ్చిన 50 వైద్య బృందాలు ఇళ్లకు వెళ్లి ఆరోగ్యానికి సంబంధించి 41 పారామీటర్స్ అంశాలపై పరీక్షల కోసం రక్తనమూనాలు సేకరించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు ఆహార పానియాలు అందించారు. గ్రామం మొత్తంగా ఎనిమిది ప్రదేశాల్లో భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి కాలుష్యం వెదజల్లుతున్న స్టోన్ క్రషర్‌ను మూసివేశారు. గ్రామంలో తాగునీటి కాలుష్యంతో కూడిన చెరువు నీటిని వినియోగించకుండా నిషేధం విధించారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తురకపాలెంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. శని, ఆదివారాల్లో సేకరించిన రక్త నమూనాలకు సంబంధించిన పరీక్షల నివేదికలను సోమవారం సాయంత్రానికి ఇచ్చేలా చూస్తామని అధికారులు తెలిపారు. తురకపాలెం ఘటనపై సిఎం చంద్రబాబు మంగళవారం మరోసారి సమీక్షించే అవకాశం ఉందని తెలియడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.



మృతిచెందిన మూగజీవాలు

పిడుగుపాటుకు 30 మేకలు మృత్యువాత

ప్రజాశక్తి-వేపాడ (విజయనగరం జిల్లా)

పిడుగుపాటుకు 30 మేకలు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా వేపాడ మండలం కొండగంగుపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కొండగంగుపూడి గ్రామానికి చెందిన గిరిజనులు నంది రమేష్, గలారి పదసాహెబ్, సార ఎర్రయ్యమ్మ, సార బుచ్చమ్మ, గలారి కేకులు తమ మూగజీవాలను మేత కోసం గ్రామ సమీపంలోని కొండపైకి తీసుకువెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో ఓ చెట్టుకిందకు వాటిని చేర్చారు. ఆ చెట్టుకు సమీపంలో పిడుగుపడడంతో మేకలు అక్కడికక్కడే మరణించాయి. సుమారు రూ.ఐదు లక్షల మేర నష్టం వాటిలినట్లు బాధితులు తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జగన్ కోరారు.

కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం

- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించే ధైర్యం లేని వైసిపి.. ప్రజా ప్రతినిధులు, ఆ పార్టీ నేతలందరూ కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా వైసిపి నేతల్లో మార్పు రాలేదన్నారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. అనంతపురంలో ఈ నెల 10న సూపర్ సిక్స్-సూపర్ సక్సెస్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమెరికాతో ఫ్రీట్రేడ్ వ్యవసాయానికి మరణశాసనం

కడపలో నేటి నుంచి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు

- 'ఉపాధి' కార్మికులకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి
- మతోన్మాద నిరోధం, రాజ్యాంగ పరిరక్షణపైనా చర్చిస్తాం
- 9న ఢిల్లీలో భారీ కన్వెన్షన్ : బి వెంకట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకట్ తదితరులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి (వైఎస్ఆర్ జిల్లా)

అమెరికా వాణిజ్య సుంకాల లక్ష్యం ఫ్రీ ట్రేడ్ ద్వారా తమ ఉత్పత్తులను గుమ్మరించడమేనని, అమెరికా ఒత్తిళ్లకు లొంగితే దేశీయ వ్యవసాయానికి మరణశాసనం రాసినట్లేనని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా నుంచి గోధుమ, డెయిరీ, కోళ్ల ఉత్పత్తులు భారతీయ మార్కెట్లను ముంచేస్తాయన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులను నాలుగు శాతం నుంచి 1.37 శాతానికి కుదించడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఉపాధి కార్మికులకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో తొలిసారిగా ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు మూడు రోజుల పాటు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మతోన్మాద నిరోధం, రాజ్యాంగ పరిరక్షణ, అంటరానితనం నిర్మూలన కోసం కూడా ఈ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. దేశంలో కుల, మతోన్మాదాల్ని ప్రేరేపించడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చి మత, చాతుర్వర్ణ రాజ్యాంగాన్ని తేవాలనే కుట్ర జరుగుతోందన్నారు. ఉపాధి హామీకి ఆధార్ అనుసంధానం వల్ల ఏడు కోట్ల మంది ఉపాధి గల్లంతు కావడంపై జాతీయ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్... ఉపాధి హామీలో టెక్నికల్ మార్పులు తెస్తున్నారని, అమెరికా సిస్టమ్ అమలు చేయడం సరికాదని తెలిపారు. ఇటువంటి అంశాలపై ఈ నెల తొమ్మిదిన ఢిల్లీలో అఖిల భారత స్థాయిలో కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ, కార్మిక, రైతు సంఘాలను, ఇతర కలిసివచ్చే సంస్థలను, సంఘాలను కలుపుకుని సమరశీల ఉద్యమానికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. కంపెనీ వ్యవసాయాన్ని తీసుకురావడమే మోడీ లక్ష్యంగా పెట్టుకున్నారని, అభివృద్ధి పేరుతో భూములను లాక్కోవడం విధానంగా మారిందని అన్నారు. ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికీ రెండు ఎకరాలు, డబుల్ బెడ్ రూమ్ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రేవంత్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ధోరణి దేశానికి నష్టాన్ని కలిగిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని 2.30 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తోన్న రైతు సంఘం నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డిని ఓ ఎమ్మెల్యే దూషించడం హేయనీయమన్నారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని 22 రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల అనుభవాలపై మూడు రోజుల సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కడప జిల్లాలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన ఐదు లక్షల ఎకరాలను అదానికి కట్టబెట్టనుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ హక్కుల సాధనకు ఉద్యమిస్తే పోలీసులు కర్కశంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విలేకర్ల సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ పాల్గొన్నారు.

11న ఆక్వా రైతుల సదస్సు

- జయప్రదం చేయాలని కోరిన రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రంప్ సుంకాల పెంపుతో ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 11న నిర్వహించే రాష్ట్ర ఆక్వా రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య కోరారు. విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న బాలోత్సవ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆక్వా రంగంపై అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధించిన సుంకాలు ఆక్వా రంగరాన్ని, రైతుల్ని కుదేలు చేస్తుందన్నారు. అమెరికా పన్నును బూచిగా చూపించి ట్రేడర్లు, కంపెనీలు ధరలు తగ్గించారని తెలిపారు. దీంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఫెడా కౌంటర్ గ్యారంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు మొత్తం కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వాలని, మరోవైపు ప్రధాని అమెరికాతో చర్చలు జరపడం, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. దేశ ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉందని, మొత్తం 9 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి 70 శాతం కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం నుంచి అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి 16 వేల కోట్లకుపైగా ఆక్వా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. గతంలో మాదిరి రొయ్యలకు కౌంట్ల వారీ ధరలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించి, ట్రేడర్లు, ఎక్స్‌పోర్టర్లు ఆ ధరలకే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఈ ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

చీరాలలో ర్యాప్ ముఠా అరెస్ట్

- రూ.14 లక్షల నగదు, కారు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని ఓ నగల వ్యాపారిని ఆశపెట్టి నమ్మబలికి.. ర్యాప్ వేసిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌పి తుషార్‌డూడీ ఆదేశాలతో చీరాలలో రూరల్ పోలీసులు నిర్వహించిన విజయవంతమైన ఆపరేషన్‌లో ఆదివారం ఈ ర్యాప్ ముఠా పట్టుబడింది. ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో చీరాల డిఎస్‌పి మెయిన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సబంధించి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక ప్రాంతానికి చెందిన నాగరాజు స్వర్ణకారుడు. అదే రాష్ట్రంలోని కొప్పల్ జిల్లా గంగావతి గ్రామానికి చెందిన ఏడుగురు ర్యాప్ ముఠాలో ఎ1 గా ఉన్న సాతుపాటి యువరాజు అనే వ్యక్తి గత నాలుగు నెలల క్రితం కుమార్ అనే పేరుతో బంగారు వ్యాపారి నాగరాజుకు ఫోన్ చేశారు. తమ వద్ద బంగారం ఉందని తక్కువ ధరకే ఇప్పిస్తామని నమ్మబాలికారు. నాగరాజును, అతని సోదరుడిని గత నెల ఆగస్టు 20న కర్ణాటక నుండి చీరాల ఆటోనగర్‌కు పిలిపించారు. సాతుపాటి యువరాజు, వారిద్దరిని కలిసి అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలలో ఒకటి చూపించి బేరం కుదుర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం నాగరాజు, ఆయన సోదరుడు కర్ణాటక నుండి చీరాలకు రూ.14 లక్షల నగదుతో వచ్చారు. ఎ1గా ఉన్న యువరాజు ఆటోనగర్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న పొలాల వద్దకు వీరిని తీసుకెళ్లి వేరే వ్యక్తులు వస్తారని నమ్మించి వెళ్లిపోయారు. కాసేపటికే మరో ఆరుగురు బేతాడి శశి కుమార్, నాగరాజు, దొడ్డ గజ్జిలేరు కిషోర్ కుమార్, ఎస్ రవికుమార్, కావాటి హరీష్, చప్పిడి మురళీకృష్ణ (కర్ణాటక రాష్ట్రం వారు) అక్కడికి వచ్చి.. బాధితుడు నాగరాజును బెదిరించి కత్తితో దాడి చేసి.. డబ్బు లాక్కుని పరారయ్యారు. నిందితులను పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ముఠా కదలికలను గుర్తించి, వారిని ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద 24 గంటల్లోపే పట్టుకుని రూ.14 లక్షల నగదు, కారు, 2 సెల్‌ఫోన్లు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.



ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం తప్పని పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యూరియా కొరత లేదని అధికారులు ప్రతిరోజూ ప్రకటనలు విడుదల చేస్తూనే ఉన్నారు. ప్రజాప్రతినిధులూ అదే పాట పాడుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. పంట దిగుబడి కోసం ప్రస్తుతం వరి పంట దశలో యూరియా వేయడం తప్పనిసరి. దీంతో రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. శ్రీకాకుళం నగరంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద రైతులు ఆదివారం బారులు తీరారు. ఉన్న స్టాకు తక్కువ, రైతులు ఎక్కువగా రావడంతో వచ్చిన రైతులందరికీ ఒక్కొక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు.

మెడికల్ కళాశాలలపై వైసిపి తప్పుడు ప్రచారం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలలపై వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పిపిపి విధానం ద్వారా నిర్మిస్తున్న భవనాల నిర్మాణాల్లో వేగం పెరుగుతుందన్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. 17 కాలేజీలు తీసుకొచ్చామని చెప్పుకుంటున్న జగన్ ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయని మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా ప్రైవేటుపరం చేస్తుందో చెప్పాలని మంత్రి సవాల్ విసిరారు. పిపిపి విధానంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలల్లో 150 సీట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆర్థిక సమస్యలతో మూలన పడ్డ కాలేజీలను మళ్లీ పిపిపి విధానంలో పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

12న ఆర్‌టిసి పరిరక్షణ దినోత్సవం

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ బస్సుల పాలసీని మార్చాలని, ఆర్‌టిసినే నేరుగా విద్యుత్ బస్సులు నిర్వహణ చేయాలని, ఆర్‌టిసిలను దేశ వ్యాప్తంగా పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 12న ఆర్‌టిసి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) పేర్కొంది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, గౌరవాధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రూపాల్లో నిరసనలు తెలపాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపునిచ్చిందన్నారు. 12న కార్మికులందరూ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, డిపోల వద్ద మానవహారాలు నిర్మించాలని, ఆర్‌టిసి పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

IBPS CLERK QUANT QUESTION PAPER




P. Moulali reddy
Director... Sri guru raghavendra bank coaching centre, nandyal,
9849546044

Q.1) Distance between P and Q is 888 kms and a train leaves from P towards Q at 7:00 am on Sunday. The trains runs at 55.5 km/hr and it halts for 2 hrs 20 min in between. It will reach at
a) 1:20 am Mondayb) 1:20 pm Monday
c) 12:20 am Monday d) 12:20 pm Monday e) None of these

2) Ritu and Neha entered into partnership and open a biryani shop with initial investment Rs. 30000 and Rs. 45000, respectively and after 6 months, Usha also joins them with initial investment Rs. 40000 and at the same time Ritu again invested Rs. 6000. If at the end of two years, Neha got Rs. 13200 as a profit, then what is the total profit earned by them?
a) Rs. 32120 b) Rs. 32220
c) Rs. 31120 d) Rs. 32130 e) Rs. 31420

Directions.3-7) Study the data given below carefully and answer the following questions:
Below bar graph shows the number of employees who work in five departments and number of female employees who work in those five departments of the company:



3) What is the ratio of number of male employees who work in department H to the number of female employees who work in department G?
a) 29: 44 b) 29: 43 c) 28: 43 d) 27: 44
e) None of these

4) What is the difference between the number of female employees working in department T and the number male employees working in department K?
a) 6 b) 7 c) 12 d) 8 e) None of these

5) The number of male employees working in department W is what percentage of the number of male employees working in department T?
a) 111.11% b) 118.18%
c) 127.27% d) 108.08% e) 109.09%

6) What is the average number of male employees working in departments T and K together?
a) 283 b) 243 c) 238 d) 240 e) None of these

7) The number of male employees working in department G and K is approximately what percentage of more or less than the number of male employees working departments H and W together?
a) 32% b) 24% c) 43% d) 51% e) 38%

Directions.8-12) Find the wrong term in the series given below.

8) 16, 65, 264, 1051, 4208, 16837
a) 1051 b) 16 c) 65 d) 264 e) 4208

9) 82, 126, 178, 238, 308, 382
a) 238 b) 178 c) 126 d) 308 e) 82

10) 6, 90, 272, 552, 932, 1406
a) 90 b) 6 c) 932 d) 552 e) 272

11) 5, 19, 44, 76, 123, 185
a) 5 b) 123 c) 19 d) 76 e) 44

12) 132, 223, 350, 519, 738, 1007
a) 132 b) 519 c) 223 d) 738 e) 350

Directions.13-22) What value will come in place of question mark (?) in the following questions?

13) 1638 ÷ 39 = ? + 55
a) -17 b) -5 c) -12 d) -21 e) -13

14) 1024 0.40 x 1024 0.20 = ?
a) 256 b) 1 c) 4 d) 16 e) 64

15) (13)2 - (12)2 + (26)2 = ?
a) 718 b) 683 c) 728 d) 701 e) 712

16) 10 x 35 - 23 x 30 = ?
a) -354 b) -331 c) -340 d) -335 e) -321

17) ?576 - ?1369 - ?289 = ?
a) -5 b) -30 c) -35 d) -20 e) -25

18) 200 x 9 = ? - 250 x 10
a) 4260 b) 4300 c) 4220 d) 4370 e) 4270



19) 23 2 - 8? + 25½ = ?
a) 547 b) 517 c) 532 d) 556 e) 544

20) + 13 × 15 = ? + - 18
a) 236 b) 228 c) 244 d) 226 e) 238

21) - 11 × 8 + = ?
a) -74 b) -68 c) -60 d) -50 e) -52

22) 14.28% of 182 + 66.66% of 297 = ?
a) 212 b) 239 c) 224 d) 245 e) 230

23) Jinat spent 40% of her monthly income on education and 20% of remaining she spent on food. She saves Rs. 6720, then what is her monthly income?
a) Rs. 16000 b) Rs. 28000
c) Rs. 14000 d) Rs. 32000 e) Rs. 18000

24) Eight years hence, age of Muskan and Priyu is in the ratio of 1: 4 and sixteen years ago, the ratio of age of Muskan and Priyu was 1: 12, then after six years from present Muskan's age is what percentage less than of Priyu's age at that time?
a) 76.15% b) 84.19% c) 61.39%
d) 88.88% e) None of these

25) The number of computers in two laboratories are in the ratio 3:8. 432 students worked in the first laboratory such that each group of four students shared a computer. If 864 students are working in the second laboratory, then how many students are in each group sharing a computer?
a) 4 b) 3 c) 9 d) 6 e) 8

26) A punching machine can make 8 holes/second. It completes a job in 8 minutes. If another punching machine can make 10 holes/second, in how much time can it complete the same job?
a) 5 minutes 48 seconds b) 6 minutes 24 seconds
c) 6 minutes 40 seconds d) 5 minutes 20 seconds
e) 4 minutes 40 seconds

Directions.27-31) Study the information given below and answer the following questions:
In a college, there are total 1600 IT students and each student knows one or more among three coding languages Ruby, Python and Java. The ratio of number of IT students who know both Ruby and Python but not Java to the number of IT students who know both Ruby and Java but not Python are 1: 1. 15%, 25% and 20% of IT students know only Ruby, only Python and only Java respectively. 5% of IT students know both Python and Java but not Ruby and 10% of IT students know all three languages.

27) The number of IT students who know Python is what percentage more or less than the number of IT students who know Ruby?
a) 5% b) 16% c) 12.5% d) 15% e) 3%

28) How many IT students know both Python and Java together?
a) 140 b) 280 c) 200
d) 120 e) 240

29) What is the ratio of number of IT students who know exactly one language to the number of IT students who know exactly two languages?
a) 1: 3 b) 5: 2 c) 2: 1
d) 3: 5 e) 3: 4

30) What is the difference between the number of IT students who know both Ruby and Python together and the number of IT students who know Java?
a) 440 b) 480 c) 400 d) 430 e) 410

31) The number of IT students who know Java or Python is what percentage of the number of IT students who know Ruby or Python?
a) 102.50% b) 106.25% c) 124.75%
d) 136.25% e) 108.25%

32) If the length of the rectangle is 25% more than the height of an equilateral triangle and perimeter of the rectangle is 228 cm. If the area of the equilateral triangle is 768?3 cm2 , then what is the area of the rectangle?
a) 3240 cm2 b) 3140 cm2
c) 3340 cm2 d) 3420 cm2 e) 3440 cm2

33) Mukesh marked-up an item by 20% above its cost price and usually sold that item at marked price. One day he increased the marked-up percent and set it at 40% and gave 10% discount on it, then by how much percent his selling price is increased?
a) 5% b) 6% c) 7% d) 8% e) 9%

34) Mixture A of milk and water contains 75% milk while mixture B of curd and water contains 85% curd in it. 30 litres of mixture A is mixed with 'x' litres of mixture B to form a mixture C that contains 18.75% water, then what is the total quantity of mixture C?
a) 120 litres b) 50 litres c) 80 litres
d) 100 litres e) 90 litres

35) Suman took a loan of Rs.159960 from a bank and returned it in two equal half-yearly instalments of Rs.98394 each at some rate of compound interest. What is the rate of interest?
a) 20% b) 25% c) 15% d) 16% e) 30%

QUANTITATIVE APTITUDE

1	a	11	e	21	c	31	b
2	a	12	d	22	c	32	a
3	b	13	e	23	c	33	a
4	e	14	e	24	a	34	c
5	b	15	d	25	b	35	e
6	d	16	c	26	b		
7	b	17	b	27	a		
8	d	18	b	28	e		
9	d	19	c	29	c		
10	e	20	b	30	c		

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ

సోమవారం 8 సెప్టెంబర్ 2025



"సాహిత్యం రాజకీయాలకు
అతీతంగా ఉండాలని ఎవరైనా అంటే-
వాళ్లు కచ్చితంగా మోసపుచ్చేవాళ్లో,
మోసపోయినవాళ్లో అయి ఉండాలి."

- కొడవటిగంటి కుటుంబరావు



ప్రకాశం

ఊరి చివర ఇళ్లలో
ఆరిపోయిన వంద క్యాండిల్ బల్బు
ఎంత వత్తి పెంచుకున్నా
చాలీ చాలని లాంతరు వెలుతురు
తీగ మీదేసుకున్న వైర్లు ఊడిపోతే
చూరు నిండా అదే పాత చీకటి!

ముచ్చటపడి సంతలో కొనుక్కున్న
రంగు రంగుల బిందెలు ఎప్పుడూ
నిండుగా ఉండాలనే కల శాశ్వతం
ఎండిపోయిన పసిబిడ్డల
పీతి గుడ్డల మీద ఈగల ముసురు
కార్డు చూపిస్తేనే రాజకీయపు రంగేసుకున్న
ట్యాంకర్ల లెక్కల్లో
పెద్ద కులాల ఇంట్లో రెండు బిందెలు
మాదిగ పల్లె లెక్క మాత్రం ఇంటికి ఒకటే
బొట్టు బొట్టులో అస్పృశ్యత!

చితుకుల మీద కాలుతున్న జొన్నపొత్తుల్లా
మాడిపోతుంటాయి కొన్ని ఊళ్లు
ఊపిరితిత్తుల నిండా నల్లమల గాలి
గుమ్మం ముందే పారుతున్నా
గొంతు దాకా రాని గుండ్లకమ్మ

అక్కడి ఆడపిల్లల నడుం మీద
నీటి బిందెల బరువు మచ్చలుంటాయి
కుర్రోళ్ల భుజాల మీద కావిళ్ళ బరువు
బోరింగు పంపుల కాడ ఎండుపోయిన పాచి వాసన
వార్తల్లో వట్టి పోయిన ఊళ్ళ జాబితాల్లో
మాత్రం నిత్యం కనబడతాయి
తరతరాల వారసత్వ సంపద అదొక్కటే!

ఎక్కడో కురిసిన వానలకు
చెరువులు నరాలు తెంచుకుని
పల్లానికి పరిగెడతాయి
గేట్లు తెరిచింది నీళ్లకో
జనాలకో అర్థం కాదు
అంతా వథా ప్రవాహం
నవ్వుతూ తుళ్ళుతూ తీసుకునే
సెల్ఫీల వెనక కొన్ని ప్రాంతాల దాహం
జలజలా దొరక్కుండా పారిపోతుంది

గుక్కెడు నీళ్లు తాగిన ప్రతిసారీ
అక్కడి ఎక్కిళ్లే గుర్తుకొస్తాయి
అంగిట్లో మెతుకు అడ్డం పడితే
కంటితడి దాహం తీర్చదు
వరద పుల్లైసులా కరిగిపోతుంది
కడుపు నిండిన సముద్రంలో
వాయుగుండం పుడుతుంది
వాన కూడా మళ్లీ నది మీదే కురుస్తుంది

రాతి హృదయాల పెత్తనాల్లో
పెరుగుతున్న ప్రణాళికా వ్యయాలకి
బ్యారేజీ మీద మెరుస్తున్న పేరు చూసైనా
కొడిగడుతున్న జిల్లా పేరు మతికి రాదు
ఐదువేల కోట్ల ఏటీఎం కార్డు ఉంటే చాలు
జనం ఎందుకు? వాళ్ళ దాహార్తి ఎందుకు?

ఇప్పటికే కోస్తా ప్రాంతపు ఎడారి తావుల్లో
వెలుగు కొండల వీపు మీద మొలుస్తున్న
ఆధునిక దేవాలయం
ఆశ చూపించి ముంచేయడానికి
ముస్తాబవుతుంది
నీటిచుక్క కోసం తపించిన ఊళ్ళు
నీళ్ళ కిందే జల సమాధి కావడం
చీని చెట్ల ముళ్ళు నేరుగా
కంట్లో దిగినంత బాధ!

– అనిల్ డ్యాని
97033 36688

సర్వే రాళ్ళను పెకలించండి!

అవును
నా మది ఇప్పుడొక
రాజుకున్న కుంపటి!
నా గది గిరిజన తండాల
కన్నీటి కుండలు నిండిన
కవితా సంపుటి!

నా నరాల నిండా కట్టలు తెంచుకున్న
అల్లూరి జిల్లాలోని
అరకులోయ, హుకుంపేట మండలాల గిరిజన గ్రామాల
ఆశల శ్వాసలే
ఎగసెగసి పడుతున్న కొన్నెత్తుటి ధారలు!

ఆదానీ నవయుగ
హైడ్రో పవర్ ప్రాజెక్టంట!
అదేమైనా అభివృద్ధి నమూనానా!
లేక అమాయక ఆదివాసీలకు
అధికారగణం ఆప్యాయంగా
అందించే అమూల్యమైన నజరానానా?

వీళ్ళు కట్టుకున్న ఇళ్లనూ, పంట చేలనూ
అరకొరగానైనా అనుభవిస్తోన్న
అటవీ హక్కుల్నీ దిక్కుల్నీ
తొక్కి పడేసే ఒకానొక
జలప్రళయ ఫర్మానా కదూ!

లేడి కూనల్లా నెమలి పిట్టల్లా
హొయలు హొయలుగా సాగే
బతుకు ధింసా నృత్యంలో
నిప్పుల వర్షాన్ని కుమ్మరించే
ఒక భస్మ కంకాళాల కార్ఖానా కదూ!

ప్రాణాంతక ప్రాజెక్టుకు
గుట్టు చప్పుడు కాకుండా
అనుమతులు ఇచ్చేసి, సర్వే రాళ్లు నాటిస్తే
ఇక్కడ పుట్టి పెరిగిన
అడవి బిడ్డల బతుకులేం గావాలి?
వాళ్లంతా ఎటు పోవాలి?

అన్నలారా.. అక్కలారా...
ఇది రాబందుల రాజ్యం!
రక్తాన్ని చిందించైనా
హక్కుల్ని కాపాడుకోవాలి
లేవండి! ముందుగా
ఈ సర్వే రాళ్ళను పెకలించండి!!

– పతివాడ నాస్తిక్
94417 24167

నంది నాటకోత్సవం ఎప్పుడు?



నంది నాటకోత్సవాలను త్వరలో నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిందని ఇటీవల సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్న వార్తలు మాత్రం ఇంకా రాలేదు. మంత్రి ప్రకటనకు నాటక రంగంలో ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషించారు కానీ.. పటిష్టమైన ప్రణాళిక, ఆచరణలో ఉన్నట్లుగా కనిపించక నిరాశ నీడలు క్రమంగా కమ్ముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటక అకాడమీ చైర్మన్ నియమితులయ్యాక, నాటకాభిలాషులు మొట్టమొదటి ఆశగా నంది నాటకోత్సవాల నిర్వహణ గురించిన ప్రకటన, సమాచారం కోసం ఎదురుతెన్నులు చూడటం ఆరంభించారు. అయితే ఈ పోటీల నిర్వహణలో ప్రధాన భూమిక నిర్వహించే రాష్ట్ర టీవీ సినిమా రంగస్థల అభివృద్ధి సంస్థకు చైర్మన్/ సభ్యుల నియామకం ఇంతవరకు జరగలేదు. ప్రతిష్టాత్మకంగా చేయవలసిన బృహత్ ప్రణాళిక ఎంతకీ ఆరంభం కాకపోవటం పట్ల కళాకారుల్లో నిరాశ నెలకొంటుంది.

నిజానికి ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడకుండా సొంత నిధులతోనో, వదాన్యుల సహకారంతోనో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా నిర్వహించే 70కి పైగా నాటక పరిషత్తులు ... ఎలాంటి అయోమయ సందిగ్ధ అవస్థ లేకుండా చక్కగా షెడ్యూల్ ప్రకారం జరిగిపోతుండడం హర్షణీయం. ఒకే ఒక ఆశ ఆధారంగా నాటక రంగ వృత్తి, అవే ఔత్సాహిక కళాకారులను నిరంతరం నాటక రంగంలో కృషి సల్పడానికి ఆధారభూతంగా ఉన్నాయి. కొన్ని పరిషత్తులు జాతీయ, ఉభయ రాష్ట్రస్థాయి అని ప్రకటించి నిర్వహణ చేస్తున్నా, ప్రధానంగా ప్రభుత్వం నిర్వహించే నంది నాటకోత్సవాల కోసమే ఎదురు చూస్తూ ఉంటారు కళాకారులు. స్వచ్ఛంద సంస్థల కంటే ప్రభుత్వ అవార్డుల ముద్ర బలమైంది కదా! నంది నాటక పోటీల నిర్వహణ పట్ల అర్థవంతమైన విమర్శలు లేవని కాదు కానీ, ఒక ప్రధాన ఉద్దేశం లక్ష్యంతో విత్తం, మానవ వనరులను సమకూర్చుకొని సాధ్యమైనంత పారదర్శకంగా నిక్ష్పాక్షికంగా, అనుభవజ్ఞులైన అధికార యంత్రాంగం తోడ్పాటుతో నిర్వహించి అవార్డులతో పాటు గణనీయంగా పారితోషకాలు ముట్ట చెబుతున్నారనే కదా కళారంగం ఆశలు, ఆకాంక్షలకు మూల కారణం.

ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెండు మూడు సాహిత్య రంగ అవార్డు ప్రదాన ఉత్సవ/ వేడుక కార్యక్రమాలు కొన్ని విమర్శలకు గురయ్యాయి. ఎంపిక విధానం, హడావుడిగా ప్రకటించి ముగించడం పట్ల తీవ్ర అసంతృప్తి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ వేదిక మీద జరిగే ఏ కార్యక్రమమైనా ఎంతో హుందాగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహింపబడాలని ఆనాటి తరం నేటి యువతరం, భావితరం ఆశావహంతో ఉండటం అత్యాశ కాదు. చాలా ప్రభుత్వ కార్యక్రమాల వలే నాటకరంగంలోనూ మొక్కుబడి తంతుగా ముగిస్తే.. అది సృజనాత్మకశీలురైన కళాకారులను తీవ్రంగా నిరాశా నిస్పృహలకు గురిచేస్తుంది. కూటమి ప్రభుత్వం ఇంతవరకు నాటక రంగానికి సంబంధించి చెప్పుకోదగ్గ ఎటువంటి పెద్ద కార్యక్రమం/ ఉత్సవం, సంక్షేమ పథకాలు గానీ చేపట్టలేదు. ఇది కళాకారులను, కళారంగాన్ని నిర్లిప్తతకు గురిచేస్తోంది.

నంది నాటక పోటీలకు కొత్త రచనలు ఆహ్వానించి ప్రోత్సహిస్తేనే తెలుగు నాటకరంగ పురోభివృద్ధికి అది దోహదపడుతుంది. గత సంవత్సరకాలంలో పరిషత్తుల్లో ప్రదర్శింపబడిన నాటకాలన్నీ పలు వేదికల మీద ప్రదర్శనకు నోచుకున్నవే. 2023 డిసెంబర్లో జరిగిన నంది నాటక పోటీలు కానీ, అంతకుముందు పోటీల్లో కానీ ఫలానా సంవత్సరాల మధ్య రాసినవే ఉండాలన్న నిబంధన పాటించారు. మరికొన్ని సందర్భాల్లో కేవలం కొత్త రచనలే దరఖాస్తుకు అర్హం అని చెప్పి కొత్త వాటికి ప్రోత్సహిస్తూ ఉండేవారు. ఈ నిబంధన ఈసారి కూడా అమలు చేస్తే నంది నాటకోత్సవాల ప్రత్యేకత కనబడుతుంది. తెలుగు నాటక రంగానికి ఒకింత మేలు జరుగుతుంది. ప్రసిద్ధ రచయితలు, ఆశావహ ఔత్సాహిక రచయితలు తప్పకుండా కొన్ని కథాంశాల్ని నంది పోటీల కోసం రిజర్వ్ పెట్టుకునే ఉంటారు. ప్రకటన ఇచ్చి, వాటిని వెలుగులోకి వచ్చేలా చేయడం అవసరం.

మరొక ముఖ్యమైన అంశం.. దరఖాస్తులను ప్రత్యక్షంగా ప్రాథమిక పరిశీలన చేసి వడపోత చేసి తుది పోటీలకు ఎంపిక చేయడమే నంది నాటక పోటీల ప్రత్యేకతను నిలబెడుతుంది. ప్రాథమిక పరిశీలన/ ఎంపిక వీడియోలు చూసి చేయటం ఏమంత హర్షించదగింది కాదు. గతంలో అలా చేసినప్పుడు ఈ రంగ పరిశీలకులు, విశ్లేషకులు, గుణ నిర్ణేతలు అప్పటి ఎఫ్డిసి చైర్మన్‌కు విజ్ఞప్తులు చేశారు. ముఖ్యంగా నంది నాటక బహుమతుల ప్రకటనలోనే అసలైన నంది ప్రతిష్ఠ ఉంటుంది. గుణ నిర్ణేతలు ఎంపికలో చూపించే పారదర్శకత అది ఎంతో గుణాత్మకంగా సాగాలి. ప్రాథమిక దశలో ఎంపికలో పొరపాట్లు జరిగితే తుది పోటీకి అన్ని విధాల అర్హమైనవి కాక కొన్ని పేలవంగా, మరికొన్ని రసవత్తరంగా ఉండి పోటీ మధ్య సమతూకం లేకుండా పోతుంది. తుది ఎంపికలో కూడా ఎలాంటి స్థానిక ఆశ్రిత. అవాంఛిత. ముందస్తు అంచనాలతో కాక గుణ నిర్ణేతలు తమ ముందు ఉంచిన వాటిలో అన్ని కోణాలలో అత్యుత్తమమైనవి పది కాలాలపాటు నాటక రంగం గుర్తుపెట్టుకొని గర్వంగా తలపోసే విధంగా ఉన్నప్పుడే పోటీలకు, పురస్కారాలకు విలువ ఉంటుంది. జాతీయ వేదికల మీద బహుభాషా నాటక పోటీలు/ ప్రదర్శన వేదికల మీద ఆధునిక తెలుగు నాటకం (పద్య బాలల యువ సాంఘిక నాటకం నాటికలతో సహా) వెనుకబడిలేదని నిరూపించాలి. మన భాషా నాటకం ఏ జాతీయ భాషా నాటకంతోనైనా సమవుజ్జీగా ఉండి, పోటీ పడగల సత్తా ఉందని సగర్వంగా తలెత్తుకుని చెప్పగల ధైర్యం పారదర్శక ఎంపికతోనే వస్తుంది.

గతంలో గుంటూరులో జరిగిన నంది నాటకోత్సవం విషయాలను గుర్తు చేసుకుంటే నిర్వహణపరంగా కళాకారులు తీవ్ర నిరాశకు గురి కాలేదని చెప్పవచ్చు. వసతి భోజన పారితోషక విషయాలు, రంగస్థల వేదికపై సాంకేతికపరమైన ఏర్పాట్ల పట్ల పెద్దగా అసంతప్తి వెలువడలేదు. న్యాయ నిర్ణయం/ ఫలితాల ప్రకటన పట్ల ఒకటి రెండు విభాగాల్లో కొన్ని భేదాభిప్రాయాలు వినవచ్చాయి. ప్రేక్షకులు, నాటక రంగం యావత్తు ప్రశంసించిన సందర్భాలు నాటక రంగ చరిత్రలో అరుదుగా ఉంటాయి. అందుకే గుణ నిర్ణేతల ఎంపిక పట్ల ప్రభుత్వం, ఎంపికైన వారు నిస్పాక్షికంగా వ్యవహరించి, అటు ప్రభుత్వ ప్రతిష్టను ఇటు నాటక రంగ ప్రతిష్టను నిలబెట్టాలి. ఉన్నత ప్రమాణాలకు, విలువలకు పెద్దపేట వేసినప్పుడే నంది నాటక పోటీల నిర్వహణ సార్థకం అయ్యేది. అన్నిటికంటే ముందు, తక్షణ అవసరం నంది నాటక పోటీల తేదీలు తదితర వివరాలతో కూడిన ప్రకటన రావడం. ఇది జరగాలంటే ఎఫ్డిసి చైర్మన్ / సభ్యుల నియామకం జరగాలి. ఇవి రెండూ ఎంత వేగంగా జరిగితే నంది నాటక పోటీలు అంత పటిష్టంగా ప్రణాళికాబద్ధంగా ఈ సంవత్సరంలోనే జరిగే అవకాశం ఉంటుంది

– మల్లేశ్వర రావు ఆకుల
తెలుగు నాటక రంగ పరిశీలకుడు.
79818 72655

ఫ్లోటిల్లా

ఫ్లోటిల్లా
ఇది ఒట్టి పడవ
ప్రయాణం కాదు

కరడుగట్టిన
యుద్ధోన్మాదులకు ఎదురొడ్డి
గాజా ప్రజలకు

మానవీయ సాయం మోసుకుపోయే
పడవల ప్రమాదకర
సాహసయానం!

వేలాది మృతులకు
కన్నీటి నివాళులు అర్పిస్తూ
లక్షలాది క్షతగాత్రులకు
ఆకలితో ఇసుకను మింగుతూ
చివరి ఊపిరితో వున్న ప్రజలకు

తమ ప్రాణాలకు తెగించి సాగుతున్న
ఫ్లోటిల్లా పడవల ప్రయాణం కదిలింది!

లక్షలాది గొంతులతో
వారికి మద్దతుగా
ఫ్లోటిల్లా ఫ్లోటిల్లా అని కోరస్ పాడుతున్న
జనం గుండెల చప్పుడు
గాజాకు ఊపిరి కావాలి
ఊపిరి కావాలిప్పుడు

గాజా గాజా గాజా!!

(ఆహార పదార్థాలు, మందులతో 200ల మంది మానవతావాదులతో 60 పడవలపై బయల్దేరిన యూరోప్ ప్రజల సాహసిక ప్రయాణం విజయవంతం కావాలని కోరుకుంటూ)

– కెక్యూబ్ వర్మ
94934 36277

సూక్ష్మ కవితలో విశాల భావన

కొంతమంది కవులు భావోద్వేగాలతో భాషను బద్దలు కొట్టకుండా, ప్రశాంత నదీతీరంలో, కోమల సుగంధ పరిమళాలతో మనిషి నుంచి మనిషికి అల్లుకుపోతారు. మనిషి మనిషిగా ప్రేమించబడాలని విశ్వ మానవ శ్రేయోభిలాషిగా ఉండాలని భావిస్తారు, కవిత్వానికి అస్పృశ్యత అంటదని, కులం, మతం, జాతి, ప్రాంతం వంటి భావాలకు కవిత్వం నిషిద్ధం కాదని వారు భావిస్తారు. ఇప్పటికీ సరిగ్గా నలభై ఏళ్ల కిందటి అభ్యుదయ కవిగా తనదైన కవితా ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రశాంత గంభీర కవితా సముద్రంలో తన కవితా హృదయాన్ని విశాల విశ్వంభర తత్వంగా ప్రదర్శిస్తూ.. ఎలాంటి పురస్కారాల వైపు కన్నెత్తి చూడకుండా నిర్మలంగా నిశ్చలంగా ప్రసన్న వదనంతో మనకు ఎదురొస్తారు. పలకరిస్తే చాలు; పరవశంగా చేయి కలిపే ఒక అద్భుత కవి, అరుదైన కవి నిరంతర పరిశోధనా పర్వంలో రీసెర్చ్ స్కాలర్స్‌కు బాసటగా నిలబడే శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు యస్డీడి చంద్రశేఖర్. ఆయన్ను తలుచుకుంటే చాలు తన్మయత్వంతో నా తనువు మనస్సు పులకరిస్తుంది. వారు నా పిహెచ్‌డికి పర్యవేక్షకులు కావడం నాకు దక్కిన అరుదైన అవకాశం.

ఎస్డీడి చంద్రశేఖర్ గారు కవిత్వం, సిద్ధాంత గ్రంథాలు, జర్నలిజం, పరిశోధనాత్మక వ్యాసాలు ... ఇలా విభిన్న సాహిత్య ప్రక్రియల్లో 15 గ్రంథాలు రచించారు. గతంలో వీరు రాసిన 'సూక్ష్మ కవితలు' సంపుటి సాహిత్యలోకంలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. దీనికి అనుబంధంగా ఇటీవలే సూక్ష్మ కవితలు–2 పేరుతో మరో సంపుటిని వెలువరించారు. ఆంగ్లంలో వెలువడే మైక్రో కవితల్ని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి నియమాలు లేకుండా వచన కవిత్వంలో రూపొందించబడిన లఘు కవితలే ఈ సూక్ష్మ కవితలు అని ఆయన అన్నారు. ప్రప్రథమంగా 2014లో ఈ ప్రక్రియను తెలుగులో ఫేస్బుక్‌లో ప్రవేశపెట్టి, సూక్ష్మ కవితలు అనే పేరుతో ఒక సమూహాన్ని కూడా నిర్వహిస్తూ వస్తున్నారు వీరు.

ఆచార్యుల వారి కవితాంతరంగాన్ని తెలుగు సాహిత్యాభిమానులకు పరిచయం చేయాలనిపించింది నాకు. కవిని నిర్బంధించవచ్చేమో గానీ, అతడి కవిత్వాన్ని నిషేధించలేవంటూ పాలక వర్గానికి ఒక కవితలో చురక వేస్తారు. కవికీ భావస్వేచ్ఛ ఉంటుంది. ఎవరి మెప్పుకోసమో రాయలేనంటారు. అక్షరానికీ కవికీ ఉన్న సంబంధాన్ని వివరిస్తారు. కవిత్వం ఎలా ఉండాలో కూడా చెబుతారు.

కవితను/ కాలితో తాకాలని చూస్తే/ తస్మాత్ జాగ్రత్త/ అది పామై కాటేస్తుంది/

కలం నాది/ కవిని నేను/ నా కవిత ఎప్పుడూ/



ఇష్టపడుల్నే తప్పు/ అష్టపదుల్ని, నష్టపదుల్ని/ కష్టపదుల్ని పలికించదు/ ఏ దత్త పదుల్ని/ దత్తత తీసుకోదు/

నేను రెండు అక్షరాల వాణ్ణి/ కావచ్చునేమో కానీ/ నాలో కోటానుకోట్ల/ అక్షరాలు కదిలాడుతూ/ మెదిలాడుతూ ఉంటాయి/ అవి నా ఊహల్నీ భావాల్నీ/ వ్యక్తీకరిస్తూనే ఉంటాయి/

కవిత్వం/ బంగారు పిచ్చుక/ గూడు అల్లినట్లు ఉండాలి/ గూట్లో వెలుతురు కోసం/ మిణుగురు బూచిని/ అతికించినట్లు ఉండాలి/

... ఇలా తనదైన అనుభూతిని, ప్రేమను ప్రకటిస్తారు..

ఆకాశం/ తన ముఖాన్ని/ అద్దంలో చూడాలనుకుని/ చక్కటి కొలను/ ఏర్పాటు చేసుకుంది/

నా గుండెల్లో/ తీయటి బాధ/ రాత్రిళ్ళు నా కనురెప్పలపై/ నిన్ను గూర్చిన కలలు/ ఇవి చాలవా నేను/ నిన్ను ప్రేమిస్తున్నాననడానికి/

తొలిసంధ్య ఒక కోయిల/ అది గొంతెత్తి పాడితేనే కానీ/ తూర్పున వెలుగు రేఖలు/ ససేమిరా పొడచూపవు/ నువ్వు నా రాత బల్లపై/ ఒక సీతాకోకచిలుకలా వాలి/ నన్నే తదేకంగా చూస్తున్నప్పుడు/ నేను కోయిలలు మోసే/ ఒక పాటల పల్లకిగా మారిపోతాను/ తోట తోటంతా నీ సోయగాల్ని చిలకరిస్తూ ...

ఇవాళ ప్రతి రాజకీయ నాయకుడు చెప్పే పచ్చి అబద్ధాన్ని ఇలా చమత్కరిస్తారు.. ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదరికం తొలగిపోదు. స్వేచ్ఛ ఎవరికైనా అవసరమే. స్వేచ్ఛ లేకుంటే జీవితం లేనే లేదంటారు. కన్నీటి చుక్క కంటే నీటి చుక్క విలువైనదని, కాలానికీ గడియారంలోని రేడియం ముల్లుకీ అవినాభావ సంబంధం ఉందని చెబుతారు. మరో కవితలో మసిగుడ్డకు లేని స్వార్థం ఈ మనుషులకు ఎందుకో.. నంటారు.

"ప్రతి రాజకీయ నాయకుడు/ చెప్పే ఒకే ఒక్క అబద్ధం/ నేను ఏ పదవులు ఆశించి/ రాజకీయాల్లోకి రాలేదు అనేదే/ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా/ ఎన్ని పథకాలు పెట్టినా/ ఆమె మాత్రం పొలాల్లో/ పరిగె ఏరుకుంటూనే ఉంటుంది/

కన్నీటి చుక్కల్ని/ మనం ఎన్నైనా పోగొట్టుకోవచ్చునేమో/ కానీ నీటి చుక్కను/ ఒక్కదాన్నైనా/ పోగొట్టుకోకూడదు/

కాలం/ గడియారం రేడియం ముల్లెక్కి/ సవారీ చేస్తూ నన్ను ఉడికిస్తూ ఉంటుంది/ దాని వెంట నేను వెళ్లాలో/ నా వెంట అది రావాలో/ తెలీక నేను సతమతమవుతున్నాను/

మసిగుడ్డ/ తనను తాను/ శుభ్రం చేసుకోవడం కంటే/ ఇతరత్రా మసిని/ శుభ్రం చేసుకోవడానికే/ ఇష్టపడుతూ ఉంటుంది/ మసిగుడ్డకు లేని స్వార్థం ఈ మనుషులకి ఎందుకో మరి?/

స్వేచ్ఛ ఎవరికైనా అవసరమే/ పక్షికైనా పతంగానికైనా/ మనిషికైనా మగువకైనా/ దేశానికైనా దేశం జెండాకైనా/ ప్రజలకైనా ప్రభుత్వాలకైనా/ చివరకు ప్రపంచానికైనా/

ప్రజలు రాజకీయ నాయకుల కన్నా చాలా తెలివైన వాళ్ళు. ఎన్ని నయవంచనలు చేసినా ఇష్టంగా గెలిపించుకుంటారు.

"ప్రజలు రాజకీయ నాయకుల కన్నా/ చాలా తెలివైన వాళ్ళు/ రాజకీయ నాయకులు/ ఎంత చెప్పినా ఎన్ని నయవంచనలు చేసినా/ తామనుకున్న వారికే ఓట్లేసి గెలిపిస్తారు"


"నేటి పాలకుల/ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు/ ప్రజలకు కంటకభూయిష్టంగానే/ ఉంటున్నాయి/ నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు"

... ఇలా ఆచార్య ఎస్జీడీ చంద్ర శేఖర్ ఈ సూక్ష్మ కవితల ద్వారా అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనగా తమదైన శైలిలో అభ్యుదయభావాలతో సామాజిక సందేశాన్ని వినిపించారు. అక్కడక్కడా కొన్ని ఆత్మాశ్రయంగా అనిపించినా సామూహిక చైతన్యాన్ని కల్గించే విధంగా, అత్యంత సరళంగా, సుబోధకంగా పాఠకులను ఆకట్టుకుంటాయి. నేటి సాహిత్య విద్యార్థులకు, భాషా బోధకులకు ఈ సూక్ష్మ కవితల అధ్యయనం చాలా అవసరం.

– డా.రాధేయ
99851 71411

దళిత కవిగా మొదలై, బహుజన కవిగా విస్తరించాను

నేలపూరి రత్నాజీ



కవి నేలపూరి రత్నాజీ గత రెండు దశాబ్దాలుగా విస్తృతంగా దళిత సమస్య మీద కవిత్వం రాస్తున్నాడు. దీర్ఘ కవిత, హైకూలు, నానీలు విడిగా కవితా ఖండికలు, నాటకాలు రాశాడు. ఇప్పటిదాకా ఏడు పుస్తకాలు ప్రచురించాడు. సమకాలీన సమస్యలపై వివిధ కవులు రాసిన కవిత్వంతో నాలుగు కవితా సంకలనాలు తీసుకొచ్చాడు. రత్నాజీ తాజాగా 'మాట్లాడుతూనే ఉంటా' పేరిటకొత్త సంపుటి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కవి రత్నాజీతో చిన్న సంభాషణ ...

ప్రశ్న : ముందుగా మీ నేపథ్యం గురించి చెప్పండి!

రత్నాజీ : పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో పుట్టాను. అమ్మ నాన్న మరియమ్మ, రామారావు. నాన్న చాగల్లు షుగర్ ఫ్యాక్టరీలో సూపర్ వైజర్‌గా పనిచేశారు. ఆయన అంబేద్కర్ వాది. హేతువాద దృష్టితో ఉండేవారు. నాకు ఒక చెల్లి ఉంది. నేను ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. నా భార్య విజయ కుమారి. మాకు ఒక పాప, బాబు వున్నారు.

మీ సాహితీ సృజనకు స్ఫూర్తి ఏమిటి? ఎవరైనా గురువు అనదగిన వారు ఉన్నారా?

చిన్నప్పటినుంచి లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదివే వాడిని. చందమామ, సోవియట్ భూమి వంటివి చదివాను. మా ఊర్లో పేరిచర్ల రామకృష్ణంరాజు అనే ఆయన 80వ దశకంలో చేతి రాత పత్రిక నడిపేవాడు. దానిలో నేను చిన్న చిన్న కవితలు రాయడం ప్రారంభించాను.

మీరు ప్రచురించిన పుస్తకాల గురించి చెప్పండి.

ఆరు, ఏడు తరగతులు చదువుతున్న కాలం నుంచి రాస్తున్నాను. నా మొదటి పుస్తకం 'ఒకే గొంతు'... 2005లో ఎస్సీ వర్గీకరణ గురించి రాశాను. తర్వాత 'నెత్తుటి మరకలు' దీర్ఘ కవిత లక్షింపేట దళితులపై జరిగిన దాడి గురించి. అప్పట్లో ఆ సంఘటన మీద మా ఊర్లో యువకులతో కలిసి ధర్నా కూడా చేశాను. తర్వాత 'చిలకల చెట్టు' పేరుతో హైకూలు; 'పిట్టలు చేరే వేళ' పేరుతో నానీలు రాశాను. ఇటీవల పాలస్తీనా సమస్య మీద 'గాజా లేని జాగా' పేరుతో దీర్ఘ కవిత ప్రచురించాను. బహుజన రాజ్యాధికారం దృష్టితో 'రాజ్యమేలే తాళం చెవి'కవితా సంపుటిని ప్రచురించాను. వర్గీకరణ మీద 'కొత్త నిబంధన' రాశాను.

మీ పుస్తకాల పైన ఎటువంటి స్పందన వచ్చింది?

మంచి స్పందన వచ్చింది. ప్రముఖ కవి ఎండ్లూరి సుధాకర్ ఫోన్ చేసి నెత్తుటి మరకలు చదివానని, అందులో పి.హెచ్డి చేసిన వాళ్లకు కూడా సాధ్యం కాని మంచి అవగాహనతో రాశారని అభినందించారు. మరో ప్రముఖ కవి శిఖామణి నా కవిత్వాన్ని బాగా ప్రోత్సహిస్తూ వచ్చారు. కలేకూరి ప్రసాద్ 'ఒకే గొంతు' కవిత్వం చదివి 'నీ కవిత్వం చదివితే కన్నీళ్ళు వచ్చాయి తమ్ముడూ!' అంటూ ఉత్తరం రాశారు. ప్రముఖ సాహిత్య విమర్శకుడు లక్ష్మీ నరసయ్య కూడా నా రచనలను బాగా ప్రోత్సహించారు. మీరు (చల్లపల్లి స్వరూప రాణి) నీ కవిత్వంలో బుద్ధిష్ట్ సింబల్స్ ఉన్నాయంటూ నన్ను అభినందించారు. ఇవన్నీ నాకు ఎంతో సంతృప్తిని ఇస్తాయి.

'మాట్లాడుతూనే ఉంటా' కవితా సంపుటిలో ఏ అంశాల మీద ఫోకస్ చేశారు? గత పుస్తకాల కంటే ఇది ఏ విధంగా ప్రత్యేకం?

గతంలో ప్రచురించినవి ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రక్రియలో ఒక్కో అంశం మీద రాసినవి. 'మాట్లాడుతూనే ఉంటా'లో సామాజికంగా, రాజకీయంగా ఈనాడు ప్రాముఖ్యత ఉన్న 50 కవితలను చేర్చాను. కుల వివక్ష యొక్క కొత్త రూపాలు, దళిత స్త్రీల మీద, మైనార్టీల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాసినవి ఉన్నాయి. తెలంగాణ, చేనేత, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్య, అమెరికాలో జార్జ్ ఫ్రాయిడ్ హత్య గురించి రాసిన కవితలు ఇందులో ఉన్నాయి. దళితుల మీద దాడి జరిగినప్పుడు నాయకత్వం నష్టపరిహారాల మీద మాత్రమే దృష్టి కేంద్రీకరించడంపై వ్యంగ్యంగా రాశాను.

మీరు దీర్ఘ కవిత, హైకూలు, నానీలు వంటి వచన కవిత్వంలోని అన్ని రూపాల్లో రాశారు. అన్నింట్లో మీకు నచ్చిన సాహిత్య ప్రక్రియ ఏది?

నాకు దీర్ఘ కవిత అంటే ఎక్కువ ఇష్టం. ఒక అంశం మీద సమగ్రంగా, లోతుగా రాయటానికి దీర్ఘకవితను ఎక్కువగా ఎంచుకుంటాను. నెత్తుటి మరకలు, గాజా లేని జాగా ఒకే గొంతు దీర్ఘ కావ్యాలే!

ఫేస్‌బుక్‌లో మీ పోస్టులు పదునైన వ్యంగ్యంతో ఉండడానికి కారణం ఏమిటి?

ప్రాథమికంగా నేను హాస్యధోరణితో ఉండే వాడిని కాదు. కానీ, అధిక్షేపం అనేది సాహిత్యంలో బలంగా వ్యక్తమవుతుంది. అందుకే వాటిని ఎంచుకుంటాను. గోదావరి ప్రాంతం వాడిని కాబట్టి మా పడికట్టులో ఉండే వ్యంగ్యం నా రచనల్లో పలుకుతుంది. సతీష్ చందర్ కూడా నా వ్యంగ్య రచనలను మెచ్చుకుంటూ ప్రోత్సహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో జరిగే చర్చలకు కొన్నిసార్లు వ్యంగ్యం తప్పనిసరి అవుతుంది.

మీరు సంపాదకత్వం వహించిన ఇతర పుస్తకాలు ఏమిటి?

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్య మీద 'ఉక్కు పిడికిలి' పుస్తకాన్ని వేశాను. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రాముఖ్యత గురించి చర్చ వచ్చినప్పుడు 'ఇంగ్లీష్ డాట్ కాం' పుస్తకాన్ని తీసుకొచ్చాను. హిజాబ్ ధరించిన ముస్లిం అమ్మాయిలపై దాడి జరిగిన సందర్భంలో 'హిజాబ్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చాను. పాలస్తీనా పసిపిల్లలపై ఇజ్రాయిల్ హింసను నిరసిస్తూ 'నగ్బ' అనే పుస్తకాన్ని తీసుకు వచ్చాను. ఇవన్నీ ఒక రచయితగా నా బాధ్యత అనుకుని తీసుకు రావడం జరిగింది.

ప్రస్తుతం వస్తున్న దళిత సాహిత్యంపై మీ అభిప్రాయం ఏమిటి? మీది దళిత కవిత్వమా? బహుజన కవిత్వమా?

ఒకప్పుడు దళిత సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం తెలుగు సాహిత్య వాతావరణాన్ని, సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసింది. వందల సంఖ్యలో కవులు వచ్చారు. వారిలో చాలామంది దళితుల మీద దాడులు, కుల సమస్య మీదే కాకుండా దళిత జీవితం మీద కూడా సాంద్రమైన కవిత్వం రాశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దళిత సాహిత్యం మాల, మాదిగ అనే రెండు పాయలుగా విడిపోయింది. నా దృష్టిలో దళిత సాహిత్యం అంటే– దళిత ఉపకులాల ఉమ్మడి సాహిత్యమే! నేను దళిత కవిగా ప్రారంభమై బహుజన కవిగా విస్తరించానను కుంటాను.

బహుజన సాహిత్యం లేదా దళిత సాహిత్యం ఎలా ఉండాలని మీరు భావిస్తారు?

పూలే – అంబేద్కర్ కుల నిర్మూలన సిద్ధాంతాన్ని అవగాహన చేసుకుని సమాజంలో జరిగే అణచివేతలపై ధిక్కార సాహిత్యాన్ని రాయాలి. దానిద్వారా మనువాదుల సామాజిక రాజకీయ ఎత్తుగడలు ఎదుర్కోవాలి. అంతిమంగా వారి సాహిత్యం రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలి.

సంభాషణ : చల్లపల్లి స్వరూపరాణి

నేడు వాక్ ఫర్ బుక్

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 8 సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య పార్క్ నుండి చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వరకు పుస్తకం కోసం నడుద్దాం రండి. రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలలో పుస్తకం కోసం నడక జరుగుతుంది. ఎవరికి వారు తమ ప్రాంతాల్లో కూడా వాక్ ఫర్ బుక్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరుతున్నాం. – మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ

సీఏ. ప్రసాద్, బండారు విజయ, మంచికంటి
8801910908, 9490175160

దేశవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటించాలి

స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను దేశవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటించాలని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ 10వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ శని, ఆదివారం రూర్కెలాలో నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ప్రవేశపెట్టగా తమిళనాడు సిఐటియు కార్యదర్శి పన్నీర్ సెల్వం బలపరిచారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదిం చింది. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, 2021 జనవరి 27న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం వ్యూహాత్మక అమ్మకానికి నిర్ణయించిందని, దీనిని వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్‌లోని అనేక కార్మిక సంఘాలను ఐక్యపరచి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి నేటికీ అనేక ఉద్యమాలను నిర్వహిస్తున్నామని వివరిం చారు. ఈ ఐక్య ఉద్యమాలను బలపరుస్తూ రాజకీయ ఉద్యమం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.11,400 కోట్లు స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిందని, కానీ ఆ కేటాయింపులను జిఎస్‌టి, బ్యాంకు బకాయిలను చెల్లించడం కోసం మాత్రమే ఉపయోగించాలనే నిబంధనను విధించిందని తెలిపారు. ఈ సమయంలో విఆర్‌ఎస్ పేరుతో సుమారు 1,600 కార్మికులను, ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిందన్నారు. తమ ఉద్యమానికి దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ పరిశ్రమల కార్మిక వర్గం అండగా నిలవాలని కోరారు. దీనిపై పన్నీర్ సెల్వం మాట్లాడుతూ, విశాఖ స్టీల్ కార్మిక వర్గానికి అండగా ఉండడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న వైఖరిని ఖండించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ సిఐటియు స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధులుగా యు.రామస్వామి, టివికె.రాజు, పుల్లారావు, బి.మహేష్, మరిడయ్య, నీలకంఠం, బిఎన్.మధు సూదన్, నమ్మి రమణ, ఒవి.రావు తదితరులతో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పార్టీకి విధేయతతో కాదు..


దేశంపై ప్రేమతో ఓటేయండి’

ఎంపిలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి


న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతి ఎన్నికసమీపించిన వేళ.. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఎంపిలకు కీలక విజ్ఞప్తి చేశారు. పార్టీ విధేయత ఆధారంగా ఓటు వేయొద్దని, దేశంపై ప్రేమతో ఓటేయాలని సూచించారు. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులను ఉద్దేశిస్తూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆదివారం వీడియో సందేశం విడుదల చేశారు.

“ఈ ఎన్నికల్లో పార్టీ విప్ ఉండదు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారానే ఎన్నిక జరుగుతుంది. ఏ రాజకీయ పార్టీకి విధేయత కాదు.. దేశం పట్ల ప్రేమ మీ ఎంపికకు మార్గనిర్దేశం చేయాలి. మన దేశ ఆత్మను కాపాడుకునే నైతిక బాధ్యత అందరిపై ఉంది. నాపై విశ్వాసం ఉంచడం ద్వారా పార్లమెంటరీ సంప్రదాయాలను రక్షించినవారవుతారు. ప్రజాస్వామ్యానికి నిజమైన దేవాలయంగా రాజ్యసభ నిలుస్తుందని చాటిచెప్పవచ్చు” అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.ఇది కేవలం ఉప రాష్ట్రపతిని ఎన్నుకునే ఓటు కాదని, భారత స్ఫూర్తిని చాటిచెప్పేదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలపై భారత ప్రజాస్వామ్యం నిర్మితమైందని, అదే దక్పథంలో దశాబ్దాలుగా బలోపేతం అవుతోందన్నారు. అయితే, నేడు ఆ ప్రజాస్వామ్య భావన తగ్గుతోందని, పౌరుల హక్కులు ఒత్తిడికి లోనవుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో ప్రజాస్వామ్య గణతంత్ర ఆత్మను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు.

బిగ్‌బాస్ సీజన్ 9 ప్రారంభం



తనూజ పుట్టస్వామి



ఫ్లోరా షైనీ



కల్యాణ్ పడాల

హైదరాబాద్ : ప్రముఖ రియాల్టీ షో బిగ్‌బాస్ తెలుగు మళ్లీ ప్రారంభమైంది. ఇది వరుసగా తొమ్మిదవ సీజన్. ఇప్పటి వరకు 8 సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో.. కొత్త హంగులతో ఆదివారం నుంచి ఆరంభమైంది. ప్రముఖ కథనాయకుడు అక్కినేని నాగార్జున వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో సెలబ్రిటీలతో పాటు, సామాన్యులకు సమాన అవకాశం ఇస్తున్నట్లు అక్కినేని ప్రకటించారు. ఇందులో భాగంగా నిర్వహించిన బిగ్‌బాస్ అగ్ని పరీక్షను దాటుకుని 13 మంది ఫైనల్‌కు చేరారు. వీరి నుంచి ఆరుగురిని ఎంపిక చేసి హౌస్‌లో పంపారు. బిగ్‌బాస్ సీజన్-9లో మొత్తం 15 మంది కంటెస్టెంట్‌లు ఉండగా..సెలబ్రిటీల విభాగంలో 9 మంది హౌస్‌లోకి అడుగు పెట్టారు. ఈ సీజన్‌లో బిగ్‌బాస్‌ను మెయిన్ హౌస్, అవుట్ హౌస్ అని రెండు ఇళ్లుగా డిజైన్ చేశారు. మెయిన్ హౌస్‌లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అవుట్ హౌస్‌లో ఏమీ ఉండవు. అగ్నిపరీక్షలో సత్తా చాటిన సామాన్యులు మెయిన్ హౌస్‌లో ఉంటారని, సెలబ్రిటీలుగా వచ్చిన కూడా అవుట్ హౌస్‌లో ఉండాలని వ్యాఖ్యాత నాగార్జున సూచించారు.

కంటెస్టెంట్‌లు వీరే..

- బిగ్‌బాస్ సీజన్-9లో తొలి కంటెస్టెంట్‌గా బుల్లితెర నటి తనూజ పుట్టస్వామి అడుగు పెట్టారు. తాను బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్తున్నట్లు తన తల్లిదండ్రులకు తెలియదని ఆమె చెప్పారు.
- రెండో కంటెస్టెంట్‌గా నటి ఫ్లోరా షైనీ (ఆశాషైనీ) అడుగు పెట్టారు. ‘నరసింహ నాయుడు’, ‘నువ్వు నాకు నచ్చావ్’ వంటి చిత్రాలతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమే.
- సామాన్యుల నుంచి కల్యాణ్ పడాల హౌస్‌లోకి అడుగు పెట్టారు. బిగ్‌బాస్ టీమ్ నిర్వహించిన అగ్ని పరీక్ష దాటుకుని ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కల్యాణ్‌కు ఎక్కువ ఓట్లు పడ్డాయి. దీంతో అతడు హౌస్‌లోకి అడుగు పెట్టిన మూడో కంటెస్టెంట్ అయినట్లు వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు.
- ఈ సీజన్‌లో నాలుగో కంటెస్టెంట్‌గా సెలబ్రిటీల నుంచి ఇమ్మాన్యుయేల్ బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగు పెట్టారు. ‘జబర్దస్త్’ షో సహా పలు సినిమాల ద్వారా ఇమ్మాన్యుయేల్ తెలుగు ప్రేక్షకు లకు సుపరిచితమే.
- ఐదో కంటెస్టెంట్‌గా కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ బిగ్‌బాస్‌లోకి అడుగు పెట్టారు. తనకు ఈ రియాల్టీషో అంటే ఎంతో ఇష్టమని చెప్పారు.
- అగ్నిపరీక్షలో భాగంగా జ్యూరీ మెంబర్స్‌ను మెప్పించిన హరిత హరీశ్ అలియాస్ మాస్క్ మ్యాన్ బిగ్‌బాస్ సీజన్9లోకి అడుగు పెట్టారు. జ్యూరీ మెంబర్ అయిన బిందు మాధవి.. ఆయన పేరును ప్రకటించారు. హౌస్‌లోకి వెళ్లే ఛాన్స్ రావడంతో తన కల సాకారమైనట్లు హరీశ్ చెప్పారు.
- ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అటు వెండితెర, ఇటు బుల్లితెరపై అలరించిన భరణి కూడా సీజన్9కు వచ్చారు.
- బిగ్‌బాస్ హౌస్‌లోకి బుల్లితెర నటి, యాంకర్ రీతూ చౌదరి అడుగుపెట్టారు. తన అసలు పేరు దివ్య అని, స్కూల్‌లో ఆ పేరు నచ్చక రీతూ అని మార్చుకున్నట్లు చెప్పారు.
- మూడో సామాన్యుడిగా డిమోన్ పవన్ హౌస్‌లోకి అడుగు పెట్టారు. తాను జపనీస్ నవలలు బాగా చదువుతానని ఈ సందర్భంగా పవన్ చెప్పారు.
- ‘బుజ్జిగాడు’ సహా పలు తెలుగు చిత్రాల్లో నటించిన నటి సంజన గల్రానీ బిగ్‌బాస్ సీజన్9లోకి వెళ్లారు.
- ‘రాను బొంబయికి రాను..’ అంటూ సోషల్ మీడియాను ఊపేసిన గాయకుడు రాము రాథోడ్..బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లాడు.
- సామాన్యుల కేటగిరీ నుంచి శ్రీజ దమ్ము బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టారు. ‘ఈ సీజన్‌లో సెలక్ట్ అవుతానని నాకు తెలుసు. నేనెప్పుడూ విజేత స్థానానికే లక్ష్యం పెట్టుకున్నా. కచ్చితంగా విజేతనవుతా.’ అంటూ ప్రేక్షకులను కోరారు.
- సెలబ్రిటీ కేటగిరి నుంచి హాస్య నటుడు సుమన్‌శెట్టి బిగ్‌బాస్ సీజన్9లోకి అడుగు పెట్టారు. ‘జయం’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆయన ‘7/జీ బందావనకాలనీ’ సహా పలు చిత్రాల్లో తనదైన నటనతో మెప్పించారు.
- సామాన్యుల కేటగిరి నుంచి ఆడియెన్స్ ఓట్ల ద్వారా ప్రియశెట్టి బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగు పెట్టారు.
- ఇక చివరిగా వచ్చిన యాంకర్ శ్రీముఖి, నటుడు అభిజీత్ విన్నపం మేరకు సామాన్యుల నుంచి మనిష్ మర్యాదను బిగ్‌బాస్ హౌస్‌లోకి పంపారు.

ఆసియా హాకీ కప్ విజేత భారత్

ఫైనల్లో దక్షిణకొరియాపై గెలుపు



రాజ్‌గిర్: ఆసియా హాకీ కప్ విజేతగా భారత్ నిలిచింది. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా దక్షిణ కొరియాతో ఆదివారం హోరాహోరీగా సాగిన పోరులో భారత హాకీ జట్టు విజయదుందుబి మోగించింది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణ కొరియాపై 4-1 తేడాతో గెలుపొంది.. హాకీ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించింది. భారత్ జట్టు హాకీ ఆసియాకప్ గెలవడం ఇది నాలుగోసారి. ఇంతకు ముందు 2003, 2007, 2017లో విజేతగా నిలిచింది. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.ఆదివారం మ్యాచ్ తొలి నిమిషంలోనే సుఖ్‌జీత్ సింగ్ ఓ గోల్ కొట్టగా.. 28, 45వ నిమిషాల్లో దిల్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ రాబట్టాడు. చివరికి 50వ నిమిషంలో అమిత్ రోహిదాస్ చివరి గోల్‌కొట్టి భారత్‌కు విజయాన్నందించాడు. 51వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు డెయిన్ సన్ గోల్ చేశాడు. తాజా విజయంతో ప్రపంచ హాకీ టోర్నీకి అర్హత సాధించిన భారత్.. వచ్చేఏడాది ఆగస్టు 14 నుంచి 30 వరకు బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగబోయే మ్యాచ్‌ల్లో సత్తా చాటనుంది.

వన్డేల్లో ఇంగ్లాండ్ ‘భారీ’ విజయం

సౌథాంప్టన్ : వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లాండ్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగుల తేడాతో విజయం సాధించిన జట్టుగా రికార్డులకెక్కింది. సౌథాంప్టన్ వేదికగా సౌతాఫ్రికాతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లాండ్ ఏకంగా 342 పరుగుల తేడాతో గెలిచి ఈ ఘనత అందుకుంది. ఈ క్రమంలో గతంలో భారత్ నెలకొల్పిన రికార్డును ఇంగ్లాండ్ బ్రేక్ చేసింది. 2023లో శ్రీలంకపై టీమ్‌ఇండియా 317 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆదివారం మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 414 పరుగులు చేసింది. జో రూట్ (100), జాకబ్ బెతెల్ (110) శతకాలు బాదగా.. జేమీ స్మిత్ (62), జోస్ బట్లర్ (62లి) హాఫ్ సెంచరీలు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టు కేవలం 20.5 ఓవర్లలో 72 పరుగులకే కుప్పకూలింది.



సకాలంలో 'బిటిపి' పూర్తి చేస్తాం

- మాజీ మంత్రి దేవినేని, ప్రభుత్వం విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో జీడిపల్లి నుంచి భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తుందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. వారు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డితో కలిసి భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌లో 1.5 టిఎంసిల నీరు నిల్వ ఉందని, డిసెంబర్ మొదటి వారంలో ఆయకట్టుకు విడుదల చేస్తామని జలవనరుల శాఖ డిఇఇ గీతాలక్ష్మి, ఏఈ హరీష్ వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

మీడియాతో దేవినేని ఉమా మాట్లాడుతూ.. గత టిడిపి పాలనలో కాలవ శ్రీనివాసులుతో పాటు తన చొరవతో అప్పటి సిఎం చంద్రబాబు బిటిపికి రూ. 968 కోట్లు మంజూరు చేయగా 30 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని విస్మరించిందన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సిఎం అయ్యారని, రాయదుర్గం, కళ్యాణ దుర్గం ఎమ్మెల్యేల చొరవతో సకాలంలో ఈ పథకం పూర్తవుతుందని తెలిపారు. రైతులు సంప్రదాయ వ్యవసాయం వీడి అత్యధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య, ఉద్యానవన పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. అందుకు అవసర మైన శాస్త్రవేత్తలు, అధికారులతో రైతులను సమావేశపరుస్తారని తెలిపారు. ఈ నెల 10వ తేదీ అనంతపురంలో తలపెట్టిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను విజయ వంతం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీని వాసులు పిలుపునిచ్చారు.

భర్త చేతిలో భార్య హతం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకొంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యను గొడ్డలితో నరికి చంపాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... ఎస్సీ కాలనీకి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్య లక్ష్మీదేవి(35)ని గొడ్డలితో నరికి చంపాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాఘవేంద్రకు అతని భార్య లక్ష్మీదేవికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంతో రాఘవేంద్ర ఆవేశంతో గొడ్డలితో భార్యపై దాడి చేశాడు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు గమనించి రక్తం మడుగులో ఉన్న లక్ష్మీదేవిని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. కాగా హత్య చేసిన రాఘవేంద్ర నేరుగా పోలీసు స్టేషన్కు వెళ్లి లొంగిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా వీరికి ఇంటర్ చదివే కుమార్తె ఉంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన యువకుటు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన గోసల భార్గవ (25) ఓ మొబైల్ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఐదు సంవత్సరాల కిందట ఓ ప్రమాదంలో కాలు విరిగిపోయిన సమయంలో వైద్యులు రాడ్డుని శస్త్ర చికిత్స ద్వారా కాలులో అమర్చారు. దీంతో వికలాంగుడైన తాను ఏ పని నీ చేయలేకపోతున్నానని మధన పడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన ఇంటిపైనున్న గదిలో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుని తండ్రి సాంబశివుడు కూడా ఒక సంవత్సరం కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ రెడ్డప్ప తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-యాడికి

తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన ఆదివారం యాడికిలో చోటు చేసుకుంది. పుట్లూరు మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తమ్మినేని సునీతమ్మ, రామ్మోహన్ దంపతులు తమ ఆరేళ్ల కుమారుడు తమ్మినేని కృష్ణతో కలిసి యాడికి గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో కృష్ణకుమార్ ఆడుకుంటూ గ్రామంలో తప్పిపోయాడు. స్థానిక తిరుణాంపల్లి గ్రామరోడ్డు సమీపంలో ఏడుస్తూ తిరుగుతుండగా అటువైపు వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి బాలుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీంతో పోలీసులు గంటలోపే బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి క్షేమంగా అప్పగించారు.

వరి పైరుకు మజ్జిగ తెగులు

- ఆందోళనలో రైతులు
- అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు



ప్రజాశక్తి-బొమ్మనహాల్ (అనంతపురం)

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో తుంగభద్ర ఆయకట్టు కింద సుమారు 10వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. సోనా మసూరి, ఆరున్నర, నెల్లూరు సోనా, టెన్ టెన్, తదితర ఈ వంగడాలను రైతులు విస్తృతంగా సాగు చేశారు. పంటకు మొదటి విడతగా రసాయన ఎరువులు పిచికారి చేశారు. అయితే ప్రస్తుతం సోనా మసూరి రకానికి మజ్జిగ తెగులు సోకింది. అయితే ఈ తెగులు నివారణకు ఏ మందు లు ఎంత మోతాదులో వాడాలి, తదితర సలహాలు, సూచనలు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారు లు అందుబాటులో లేక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో పంట పొలాలను మొబైల్‌లో ఫొటోలు తీసుకుని ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి ఫొటోలు చూపించి వారి సలహా మేరకు క్రిమిసంహార మందులు పిచికారి చేస్తున్నారు. గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రానికే పరిమితం అవుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువుల పంపిణీ, క్రాప్ బుకింగ్ చేయడం వరకే తమ పని అన్నట్లు వారు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, మొక్కజొన్న, తదితర పైరులో తెగుళ్ల నివారణకు మందులు సూచించడంతో పాటు దిగుబడి పెంపునకు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి సాయికుమార్‌ను వివరణ కోరగా గ్రామాల్లో ఉన్న సిబ్బంది పంట పొలాలకు వెళ్తున్నారని, అక్కడ రైతులకు అవసరమైన సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



జిరాక్స్ కాపీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

జిరాక్స్ కాపీలే పట్టాలనుకోండి

- గిరిజనులకు తహశీల్దార్ సూచన
- నిరసన తెలిపిన బాధితులు

ప్రజాశక్తి- సాలూరు రూరల్ (పార్వతీపురం మన్యం జిల్లా)

అటవీ హక్కు పట్టాలు మాయం చేసి జిరాక్స్‌లు కాపీలను పట్టాలు అనుకోమని సెలవిచ్చారు పార్వతీపురం మన్యం జిల్లా తహశీల్దార్. ఎన్నో ఏళ్లుగా కొండపోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు పట్టాలు తమకు ఇవ్వాలని పలుమార్లు కలెక్టర్‌ను, ఐటిడిఎ పిఒను కోరారు. అయినా, నేటి వరకు పట్టాలు ఇవ్వలేదు. కొందరికి పట్టాలిచ్చినా ఆ పట్టాలు ఆఫీసులో ఎక్కడున్నాయో కనిపించట్లేదని, వాటి తాలూకు జిరాక్స్ పేపర్‌ను పట్టాలు అనుకొండని తహశీల్దార్ గిరిజనులకు తెలిపారు. దీంతో, మండలంలోని బొర్రపనుకువలస గ్రామ ఆదివాసీలు తమ సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఆ గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాసి మాట్లాడుతూ 2021లో అటవీ భూముల పట్టాల కోసం సుమారు 35 కుటుంబాలకు సంబంధించిన భూములకు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఏళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ వివిధ రూపాల్లో పోరాటాలు చేయగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, కలెక్టర్, ఐటిడిఎ పిఒ గతంలో పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కొందరికిచ్చిన జిరాక్స్ కాపీలను పట్టాలు అనుకోవాలని తహశీల్దారు ఇటీవల చెప్పారని, ఒరిజినల్ పట్టాలను మాయం చేసి గిరిజనులను మోసగించిన వారిపై చర్యలు తీసుకొని, పట్టాలు పంపిణీ చేయాలని పోరాటాలు నిర్వహించగా రెవెన్యూ కార్యాలయంలో పట్టాలు కనబడడం లేదని తెలిపారన్నారు. వీటి స్థానంలో మళ్లీ కొత్తగా పట్టాలిస్తామని చెప్పిన అధికారులు ఈరోజు వరకూ పట్టాలు పంపిణీ చేయకుండా గిరిజనులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టాల సమస్యను శాశ్వత పరిష్కారం చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గెమ్మెల నాగేశ్వరరావు, తాడంగి నర్సింగరావు, మెల్లిక కోమన్న, మర్రి ముగిరి, గెమ్మెల్ శ్రీను, కొర్ర సన్యాసిరావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణానికి మంత్రి అనుచరుడు బ్రేక్

- లబోదిబోమంటున్న మహిళా సంఘం సభ్యులు
- మంజూరుకు అనుమతివ్వని వెలుగు అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా కానరాని ఫలితం

ప్రజాశక్తి- పార్వతీపురం

అధికారం, అహంకారం కలిస్తే ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా విచక్షణ లేకుండా వ్యవహరిస్తాడు. తాను ఏం చేయకూడదో, ఏం చేయాలో తెలియని స్థితిలోకి వెళ్లి తప్పుడు పనులు చేస్తుంటాడు. ఇలాంటి చిల్లర పనులు చేయడం వల్ల ఆయన పని చేస్తున్న రాజకీయ పార్టీకి, నమ్ముకున్న నేతకు చెడ్డ పేరు వస్తుందని తెలిసినా అధికారం, అహంకారం అలాంటి పనులనే చేయాలని ఉసిగొల్పుతాయి. పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని పాచిపెంట మండలం మోసూరులో టిడిపికి చెందిన ఓ చోటా నాయకుడు చేసిన చిల్లర పనికి ఆ పార్టీ కార్యకర్తలే ఉమ్మేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ముఖ్య అనుచరుడైన గ్రామ నాయకుడొకరు ఆ గ్రామానికి చెందిన వరలక్ష్మి మహిళా సంఘానికి మంజూరు కావాల్సిన బ్యాంక్ లింకేజీ రుణాన్ని అడ్డుకున్నారు. మండలానికి చెందిన వెలుగు ఎపిఎం, సిసిలపై ఒత్తిడి పెంచి రుణం మంజూరుకు బ్రేక్ వేశారు. ఆ సంఘంలో ఉన్న 11మంది మహిళల్లో తొమ్మిదిమంది టిడిపి సానుభూతిపరులే. అయినా, ఆ చోటా నాయకుడు బ్యాంక్ రుణం మంజూరు కాకుండా తన తడాఖా చూపిస్తున్నారు. బ్యాంకు నుంచి ఎప్పటికప్పుడు లింకేజ్ రుణాన్ని తీసుకుంటూ సకాలంలో చెల్లిస్తున్న ట్రాక్ రికార్డ్ ఆ సంఘానికి ఉంది. దీంతో, బ్యాంక్ అధికారులు కూడా వారికి ఐదో విడత రుణం మంజూరు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంఘంలో సభ్యురాలైన పట్నాన గోవిందమ్మ గ్రామంలో లేకపోవడం, వలస వెళ్లిపోవడంతో మిగిలిన సభ్యులతో సహకరించడం లేదు. ఈ కారణంతో పట్నాన గోవిందమ్మను సంఘం నుంచి తొలగిస్తూ సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. జూలై ఐదున సంఘం తీర్మానం చేసి బ్యాంక్ లింకేజ్ రుణం కోసం బ్యాంక్‌లో సభ్యులంతా ఇకెవైసి కూడా వేశారు. అయితే, సంఘం చేసిన తీర్మానంపై గ్రామానికి చెందిన వెలుగు సిసి, ఎపిఎం సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ సంతకాలు చేయకుండా వెలుగు అధికారులపై చోటా టిడిపి నాయకుడు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో, వారి అవసరాల కోసం తీసుకోవాల్సిన రుణం నిలిచిపోయింది. జూలై 21న మహిళా సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘం సభ్యులు ఆవేదన చెందుతున్నారు. మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఆ చోటా నాయకుడు సొంత పార్టీకి చెందిన మహిళా సంఘానికి రుణం మంజూరు కాకుండా అడ్డుకోవడం చర్చనీయాంశమవుతోంది.

కారు బీభత్సం



- మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న వైనం
- ఇద్దరు మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)

విజయనగరం జిల్లా జామి మండలం భీమాలి వద్ద కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... లక్కవరపుకోట మండలం భీమాలి గ్రామానికి చెందిన గుల్లిపల్లి సురేష్ (32), జామి మండలం సిరికిపాలెం గ్రామానికి చెందిన బోని సాగర్ (24), మిడతాన సూర్యప్రకాశ్ వేర్వేరు ద్విచక్ర వాహనాలపై తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారు. కొత్తవలస వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు వీరి ముగ్గురి ద్విచక్ర వాహనాలనూ ఢీకొంది. దీంతో, సాగర్, సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. సూర్యప్రకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీకొంది. కారు ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. సూర్యప్రకాశ్‌ను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. జామి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మకు తెగులు.. రైతుకు దిగులు

- దిగుబడీ లేదు..ధరా లేదు



ప్రజాశక్తి - గూడూరు టౌన్

దేశ వ్యాప్తంగా గూడూరు నిమ్మకాయకి మంచి గిరాకీ ఉంది. మూడు నెలల క్రితం నిమ్మ రైతులకు దిగుబడి ఆశాజనకంగా ఉంది. నిమ్మ తోటలకు తెగుళ్లు సోకుతుండటంతో ఇప్పుడు పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది.

నిమ్మ కాయలకి తెల్ల మంగు, గాడిద మచ్చలు సోకడంతో దిగుబడి తగ్గి రైతులు కాపును తోటల్లోనే వదిలేస్తున్నారు. దిగుబడి తగ్గి, కాయలో నాణ్యత లోపించడంతో క్రయ, విక్రయాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

సకాలంలో వర్షాలు కూడా పడకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. వర్షాలు లేని కారణంగా తెగుళ్లు సోకి నిమ్మ రైతులు నష్ట పోతున్నారు. గతంలో లావులు కె.జీ 60 నుండి 70 రూపాయలు ధర పలికింది, ఇప్పుడు 30 నుండి 40 రూపాయలు పలుకుతోంది. గతంలో సన్నాలు కెజి 30 నుండి 40, ఇప్పుడు 15 నుండి 25 రూపాయలు పలుకుతోంది. అదేవిధంగా బీజా పూర్, తమినాడు, మహా రాష్ట్రలో ఎక్కువ దిగుబడి రావడంతో ఆ ప్రభావం గూడూరు నిమ్మకాయ లకు మీద పడింది.

తెగుళ్లతో నష్టపోయాం

నిమ్మ చెట్లకు తెల్ల మంగు, గాడిద మచ్చలు సోకడంతో తీవ్రంగా నష్ట పోయాం. ఇప్పటికి వరకు మూడు లక్షల రూపాయలను పురుగు మందులకు ఖర్చు చేశాను. అయిన ప్పటికీ ఫలితం శూన్యం. పెట్టుబడి కూడా రావడం లేదు, కూలి ఖర్చులు కూడా రావట్లేదు. పంట అలాగే చెట్లకు వదిలేసే పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కనుమూరు సురేష్ రెడ్డి, రైతు, చెన్నూరు



విజయవాడ ఉత్సవ్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎంపి కేసినేని చిన్ని

22 నుండి విజయవాడ ఉత్సవ్

- లోగోను ఆవిష్కరించిన ఎంపి కేసినేని చిన్ని

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శ్రేయాస్ మీడియా సంస్థ సహకారంతో ప్రతిష్టాత్మకంగా 'విజయవాడ ఉత్సవ్' నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. విజయవాడ వైభవం దేశమంతా తెలిసేలా చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'విజయవాడ ఉత్సవ్' కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని పోరంకి మురళి రిసార్ట్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఆ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్' లోగోను ఆయన ఆవిష్కరించారు.

ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండు వరకు కృష్ణా నది తీరం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాల, ఇందిరా గాంధీ మైదానం, గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ మైదానాల్లో వేడుకలు జరగనున్నాయని చెప్పారు. పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందించే లక్ష్యంతో వినోదభరిత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటా 'విజయవాడ ఉత్సవ్' నిర్వహిస్తామని తెలిపారు. కర్టన్ రైజర్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగిందని, విజయవాడ ఒక వైబ్రెంట్ సిటీ అని అన్నారు. 2025 దసరా సందర్భంగా 'సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ' సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హీరోయిన్ సంయుక్త మీనన్, దివి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ, విజయవాడ అందమైన నగరమన్నారు. విరూపాక్ష సినిమా రిలీజ్ ముందు కనకదుర్గ అమ్మవారి దర్శనం చేసుకున్నానని గుర్తు చేసుకున్నారు. విజయవాడ ఉత్సవ్ ఒక విజన్‌తో చేస్తున్నారని, ప్రజలందరి మద్దతుతో ఇది విజయవంతం అవుతుందని అన్నారు. పర్యాటకాన్ని ప్రొమోట్ చేస్తూ ప్రపంచం విజయవాడ వైపు చూడాలని ఈ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఓట్ల చోరీకి బ్యాక్ ఆఫీస్‌గా ఇసి

- జిఎస్‌టి సంస్కరణల్లో తమ విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదు
- ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓట్ల దొంగతనానికి కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి బ్యాక్-ఆఫీస్‌గా మారిందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆదివారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఓటర్ల మోసానికి సంబంధించిన దర్యాప్తులో వివరాలను దాచిపెట్టాలని ఇసి తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. 2023 మేలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్ల "భారీ తొలగింపు" అని జరిగిందని, నకిలీ ఫారమ్ 7 దరఖాస్తులతో వేలాది మంది ఓటర్ల హక్కులను తొలగించారని ఖర్గే పేర్కొన్నారు. "ఫిబ్రవరి 2023లో ఒక కేసు నమోదైంది. దర్యాప్తులో 5,994 నకిలీ దరఖాస్తులు వెల్లడయ్యాయి. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యం. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం నిందితులను పట్టుకోవడానికి సిఐడి దర్యాప్తుకు ఆదేశించింది" అని ఆయన వివరించారు. అయితే దర్యాప్తుకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచిపెట్టిందని, "ఓటు చోరీ" వెనుక ఉన్నవారిని ఎన్నికల సంఘం "కవచం"గా పని చేస్తోందని విమర్శించారు. "ముఖ్యమైన ఆధారాలను ఇసి అకస్మాత్తుగా ఎందుకు బ్లాక్ చేసింది? అది ఎవరిని రక్షిస్తోంది? బిజెపి ఓటు చోరీ విభాగమా? సిఐడి దర్యాప్తును పక్కదారి పట్టించడానికి బిజెపి ఒత్తిడికి ఇసి తలొగ్గుతుందా?" వ్యక్తి ఓటు హక్కును కాపాడాలి. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అని ఖర్గే అన్నారు.

బీహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ కూలిపోతుంది

ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఇసి పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే విమర్శించారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఇసి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీతో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని, బీహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్‌డిఎ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందని విశ్వాసంగా చెప్పారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బీహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతున్నదని తెలిపారు.

ప్రధాని మోడీ అహం దేశాన్ని దెబ్బతీస్తోంది

జిఎస్‌టి సంస్కరణల్లో తాము చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదని, ప్రధాని మోడీ అహం దేశాన్ని దెబ్బతీస్తోందని మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. జిఎస్‌టి సంస్కరణలను అమలు చేయడంలో జాప్యంపై మోడీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. పరోక్ష పన్నులను సరళీకరించాలని తాము నిరంతరం డిమాండ్ చేస్తున్నామని గుర్తు చేశారు. "గత ఎనిమిదేళ్లుగా మేము జిఎస్‌టి సంస్కరణల కోసం పోరాడుతున్నాం. కానీ మోడీ ప్రభుత్వం ఆ విజ్ఞప్తులను ఎప్పుడూ అంగీకరించలేదు" అని ఖర్గే అన్నారు. ప్రధాని మోడీ "విదేశాల్లో విదేశీ నాయకులను ప్రోత్సహించడం" చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇది భారతదేశ విదేశాంగ విధానానికి తప్పుడు ఉదాహరణగా నిలుస్తుందని హెచ్చరించారు. తాము ప్రజల సమస్యలను లేవనెత్తుతూనే ఉంటామని పునరుద్ఘాటించారు.

రాష్ట్రాలకు ఐదేళ్లపాటు పూర్తిగా పరిహారం చెల్లించాలి

కాంగ్రెస్ పార్టీ 2019, 2024 మ్యానిఫెస్టోలలో "సరళమైన,హేతుబద్ధమైన" పన్ను వ్యవస్థతో జిఎస్‌టి 2.0ను ప్రతిపాదించిందని, జిఎస్‌టి సమ్మతిని సరళీకరించాలని డిమాండ్ చేసిందని అన్నారు. 2005లో యుపిఎ ప్రభుత్వం జిఎస్‌టి ఆలోచనను తొలిసారిగా ప్రవేశపెట్టిందని, 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ జిఎస్‌టి బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బిజెపి దానిని వ్యతిరేకించిందని ఖర్గే గుర్తు చేశారు. "జిఎస్‌టిని మోడీ తీవ్రంగా వ్యతిరేకించారు" అని ఆయన అన్నారు. "నేడు, అదే బిజెపి ప్రభుత్వం రికార్డు స్థాయిలో జిఎస్‌టి వసూళ్లను చేస్తోంది. సామాన్యుల నుండి పన్ను వసూలు చేయడం గొప్ప విజయం అన్నట్లుగా ప్రస్తుత ప్రభుత్వాన్ని కపటత్వాన్ని ప్రదర్శిస్తోంది" అని ఆయన ఆరోపించారు. తక్కువ పన్ను రేట్ల కారణంగా ఆదాయం తగ్గే అవకాశం ఉన్నందున, 2024-25ని బేస్ ఇయర్‌గా తీసుకుని, రాష్ట్రాలకు ఐదేళ్లపాటు పూర్తిగా పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు.

ఫుడ్ డెలివరీ ఇక మరింత ప్రియం

- యాప్స్ ద్వారా ఆర్డర్ చేస్తే 18 శాతం లెవీ కట్టాల్సిందే

న్యూఢిల్లీ : జొమాటో, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా ఆహార పదార్థాలు ఆర్డర్ చేస్తున్నారా? అయితే ఒక్కసారి ఆలోచించుకోండి. ఎందుకంటే ఈ స్థానిక డెలివరీ సర్వీసుల ద్వారా ఫుడ్ ఆర్డర్ చేస్తే 18 శాతం లెవీ చెల్లించాల్సి ఉంటుంది మరి. ఇటీవల జరిగిన జీఎస్టీ 56వ కౌన్సిల్ సమావేశం ఈ మేరకు సిఫారసు చేసింది. ఇప్పటికే ఫుడ్ ఆర్డర్లపై రెస్టారెంట్ల తరపున ఐదు శాతం వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇకపై దీనికి అదనంగా మరో 18 శాతం లెవీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ-కామర్స్ ఆపరేటర్ల (ఈసీఓలు) ద్వారా పొందే స్థానిక డెలివరీ సేవలకు జీఎస్టీ చెల్లించాల్సి వస్తుంది. అయితే ఈ జీఎస్టీని వినియోగదారులు భరించాలా లేక దానిని సర్వీస్ ప్రొవైడర్లు చెల్లిస్తారా అనే దానిపై యాప్ యాజమాన్యాలు స్పష్టత కోరుతున్నాయి. ఏదేమైనా ఈ అదనపు వ్యయాన్ని వినియోగదారుల నెత్తినే రుద్దే అవకాశాలు కన్పిస్తున్నాయి.

డెలివరీ సేవలపై జొమాటో, స్విగ్గీలు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే వినియోగదారులకు డెలివరీ భాగస్వాములు సేవలు అందిస్తున్నారనీ, తాము కాదని అవి వాదిస్తున్నాయి. ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి ప్రయాణ యాప్‌లు కూడా ఇలాంటి వాదననే ముందుకు తెస్తున్నాయి. డ్రైవర్లు స్వతంత్రులని, తమ పని వారిని ప్రయాణికులతో కలపడం వరకే పరిమితమని అవి చెబుతున్నాయి

అమెరికా దిగుమతులపై 75 శాతం టారిఫ్ విధించండి

ప్రధాని మోడీకి కేజ్రీవాల్ సవాలు

గాంధీనగర్ : అమెరికా దిగుమతులపై 75 శాతం టారిఫ్ విధించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సవాలు విసిరారు. ట్రంప్ టారిఫ్‌లకు ప్రతిస్పందనగా ప్రధాని మోడీకి ధైర్యముంటే ఈ పని చేయాలని డిమాండ చేశారు. సురేంద్రనగర్ జిల్లా చోటిలాలో 'కిసాన్ మహాపంచాయిత్'లో పాల్గొనేందుకు కేజ్రీవాల్ ఆదివారం గుజరాత్‌కు చేరుకున్నారు. అయితే భారీ వర్షం కారణంగా ఈ కార్యక్రమం వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా పత్తి దిగుమతులపై ఈ ఏడాది డిసెంబర్ వరకు 11 శాతం సుంకాన్ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం దేశ పత్తి రైతులను దెబ్బతీస్తుందని అన్నారు. ఇది అమెరికా రైతులను ధనవంతులుగా మరియు గుజరాత్ సాగుదారులను పేదలుగా మారుస్తుందని అన్నారు.

ప్రధాని ధైర్యం చూపాలని కోరుకుంటున్నామని, దేశం మొత్తం మీ వెనుక ఉందని అన్నారు. భారతదేశ ఎగుమతులపై ట్రంప్ విధించిన 50శాతం సుంకానికి ప్రతిస్పందనగా అమెరికా నుండి వచ్చే దిగుమతులపై 75శాతం సుంకాన్ని విధించాలని, దేశ ప్రజలు ఆ భారాన్ని భరించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అప్పుడు ట్రంప్ తలవంచుతారో లేదో చూడండి అని కేజ్రీవాల్ అన్నారు.

అలాగే పత్తికి కనీస మద్దతుధర నిర్ణయించాలని, 20 కిలోలకు రూ.2,100 చొప్పున పత్తిని కొనుగోలు చేయాలని, ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమెరికా భారత్‌పై విధించిన 50శాతం సుంకాలతో వజ్రాల కార్మికులను తీవ్రంగా ప్రభావితం చేసిందని, కానీ మోడీ ప్రభుత్వం ట్రంప్ ముందు మోకరిల్లిందని కేజ్రీవాల్ మండిపడ్డారు.

చికాగోలో చెలరేగిన నిరసనలు

- దేశ బహిష్కరణ చేస్తానంటూ ట్రంప్ సోషల్ మీడియాలో బెదిరింపులు
- నిరసనగా హోరెత్తిన వీధులు



చికాగోలో వెల్లువెత్తిన నిరసనలు

చికాగో : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చికాగో నగరానికి నేషనల్ గార్డులను పంపి అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరిస్తానని బెదిరింపులకు దిగారు. దీనికి వ్యతిరేకంగా శనివారం చికాగోలోని డౌన్‌టన్‌లో వేలాదిమంది వలసదారులు, న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనలు నగర శివారు ప్రాంతాలకు, రాజధాని వాషింగ్టన్‌కు విస్తరించాయి. హింసాత్మక నేరాల అదుపు పేరుతో 2 వేల మంది నేషనల్ గార్డులను వాషింగ్టన్‌లో మోహరించిన విషయం తెలిసిందే. ఇమ్మిగ్రేషన్ చర్యలతో మా కుటుంబాలు విడిపోతాయని, లాటిన్ కమ్యూనిటీలు లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్షుడి బెదిరింపులతో మెక్సికన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిరాశగా మారాయన్నారు. ట్రంప్ సోషల్ మీడియాలో " అపోకలిప్స్ నౌ " సినిమాలోని ఆర్మీ అధికారిగా తనను తాను పోల్చుకుంటూ బెదిరించారు. అయితే ఇల్లినాయిస్ గవర్నర్ జెబి ప్రిట్జ్‌కర్ , మేయర్ బ్రాండన్ జాన్సన్ ట్రంప్ బెదిరింపులను ఖండించారు. నియంత కావాలనుకనే వారికి చికాగో బయపడదన్నారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సి (ఐసిఇ) ప్రకటనతో మెక్సికన్ స్వాతంత్ర్యదిన వేడుకల్లో విషాదం అలుముకుందని, చికాగోలో కొన్ని మెక్సికన్ పండుగలు రద్దు చేసారన్నారు. ప్రభుత్వ ఇమ్మిగ్రేషన్ విధానంతో అమెరికా నష్టపోతుందని తెలిపారు. శుక్రవారం ట్రంప్ రక్షణ శాఖను యుద్ధ శాఖగా పేరు మార్చారు. ఇది ప్రపంచానికి విజయ సందేశం పంపుతుందన్నారు. అయితే ఆయన శాఖ పేరు మార్చి అమెరికా పౌరులపైనే యుద్ధం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

సెయిల్ కుంభకోణం కేసులో...

- అవన్ స్టీల్ కంపెనీపై సిబిఐ ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ : స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఉక్కు అమ్మకాలకు సంబంధించిన కుంభకోణం కేసులో అవన్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కుంభకోణంలో వెంకటేష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఐపీపీఎల్)పై ఇప్పటికే కేసు నమోదైంది. తాజాగా లోక్‌పాల్ సూచన మేరకు అవన్ స్టీల్‌పై కూడా కేసు పెట్టారు. సెయిల్ అధికారుల అండదండలతో అవన్‌కు చౌకగా ముడి పదార్థాలను విక్రయించారని, ఫలితంగా సెయిల్ కంపెనీ రూ.263 కోట్ల నుంచి రూ.370 కోట్ల వరకూ నష్టాన్ని చవిచూసిందని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు.

లైబ్రరీ క్లర్క్‌గా ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు: ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ కు యావజ్జీవ శిక్ష పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో శిక్షఅనుభిస్తున్నారు. ఇక్కడ లైబ్రరీ క్లర్క్‌గా రేవణ్ణకు పనిని కేటాయించినట్లు జైలు అధికారులు తెలిపారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటికి సంబంధించిన వివరాల రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు అప్పగించారు. దీనికి ప్రతిఫలంగా రోజుకు రూ.522 జీతంగా ప్రజ్వల్‌కు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. జైలు నిబంధనల ప్రకారం.. జీవిత ఖైదు అనుభవిస్తున్న వారు జైల్లో ఏదో ఒక రకమైన పని చేయాల్సి ఉంటుందని.. వారి నైపుణ్యాలను బట్టి నియామకాలు చేపడతామన్నారు. ప్రజ్వల్ ఆఫీస్ వర్క్‌ను ఎంచుకోవడంతో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించామన్నారు. జైల్లో ఖైదీలు సాధారణంగా నెలకు కనీసం 12 రోజులు, వారానికి మూడు రోజులు తప్పకుండా పని చేయాలనే నిబంధనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం

- ఒకరి మృతి, 19 మందికి గాయాలు

ముంబయి : దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరో 19 మంది గాయపడ్డారు. దహిసర్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 36 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దహిసర్ తూర్పు ప్రాంతంలోని ఒక భవంతిలో ఏడో అంతస్థులో మధ్యాహ్నం 4:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఏడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటన్నరకు పైగా శ్రమించి మంటల్ని ఆర్పేశారు. ఈ ప్రమాదం నుంచి 36 మందిని నిచ్చెన సాయంతో కాపాడారు. వీళ్లలో గాయపడిన 19 మందిని సమీపంలోని నార్తర్న్ కేర్ హాస్పిటల్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వాళ్లలో నాలుగేళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.ఏడో అంతస్థులోని విద్యుత్ వైర్లు దెబ్బతినడం.. లేదా సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రారంభమైన మంటలు క్రమంగా మంటలు ఎలక్ట్రిక్ వలయం నుంచి పై అంతస్థులకు వ్యాపించాయని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు తెలిపారు.

బిజెపి రెండు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి తన ఎంపీలతో రెండ్రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ ఆదివారంనాడిక్కడ ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్ ప్రారంభం కాగానే.. జిఎస్‌టిలో సంస్కరణలు తీసుకువచ్చిన ప్రధాని మోడీని సభ్యులు ప్రశంసలతో ముంచెత్తారు. తొలి రోజు ఆదివారం ఈ వర్క్‌షాప్‌లో 2027 నాటికి అభివృద్ధి దిశగా భారత్, సోషల్ మీడియాను ఎంపీలు సమర్థవంతంగా వినియోగించడం.. ఈ రెండు ప్రధాన అంశాలపై చర్చించారు. అలాగే వ్యవసాయం, రక్షణ, ఇంధనం, విద్య, రైల్వేలు తదితర కమిటీలతో ఈ ఎంపీలు సమావేశం కానున్నారు. రెండో రోజు సోమవారం జరిగే వర్క్ షాప్‌లో ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎంపీలకు వివరించి, మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు.



విజయవాడలో జెవివి, స్కై వాచర్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన టెలిస్కోపుల్లో చంద్రగ్రహణాన్ని వీక్షిస్తున్న విద్యార్థి



తిరుపతిలో చంద్రగ్రహణాన్ని వీక్షిస్తూ భోజనాలు ఆరగిస్తున్న ప్రజలు

జెవివి, స్కై వాచర్స్ ఆధ్వర్యాన

సంపూర్ణ చంద్రగ్రహణం వీక్షణ

ప్రజాశక్తి- విజయవాడ

సంపూర్ణ చంద్రగ్రహణాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించడానికి జన విజ్ఞాన వేదిక (జెవివి) విజయవాడ నగర కమిటీ, విజయవాడ స్కై వాచర్స్ ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీ హిల్‌పై ఆదివారం రాత్రి ప్రత్యేక ఏర్పాటు చేశారు. రెండు టెలిస్కోపులు ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన ప్రజలకు, విద్యార్థులకు, పిల్లలకు వాటి ద్వారా చంద్రగ్రహణాన్ని చూపించింది. చంద్రగ్రహణం ఎలా ఏర్పడుతుంది? ఇప్పుడు వచ్చిన బ్లడ్ మూన్ ప్రత్యేకతలు తదితర విషయాలను వివరించారు. 200 మందికిపైగా ప్రజలు, విద్యార్థులు వీక్షించడానికి వచ్చారు.

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నగర ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, బోయి రవి, డాక్టర్ హనుమయ్య, రాజశేఖర్, శోభన్ కుమార్, విజయవాడ స్కై వాచర్స్ కన్వీనర్ పోతిన ఉమ, జిల్లా సైన్స్ ఆఫీసర్ హుస్సేన్, జెవివి ప్రతినిధి బోయి రవి తదితరులు అక్కడికి వచ్చిన వారికి టెలిస్కోప్‌లో చంద్ర గ్రహణాన్ని చూపిస్తూ వివరించారు. అయితే, విజయవాడలో ఆకాశం మేఘావృతంగా ఉండడంతో చంద్రగ్రహణాన్ని పూర్తిగా చూడలేకపోయారు. తిరుపతిలోని ఇందిరా మైదాన్ తుడా పార్కులోనూ జెవివి ఆధ్వర్యాన టెలిస్కోపిక్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మహేష్, రెడ్డప్ప, బిర్లా నాయుడు, కుప్పు స్వామి, రఫీ, రమణ, వేమన విజ్ఞాన కేంద్రం బాధ్యులు నాగార్జున తదితరులు పర్యవేక్షించారు. సుమారు ఆరు వందలమంది వీక్షించారు.

ఇఐపిఎల్ ఆయిల్ ట్యాంక్‌పై పిడుగు

- భారీగా ఎగిసిన మంటలు

ప్రజాశక్తి- ములగాడ (విశాఖపట్నం)



విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని ఈస్ట్ ఇండియా పెట్రోల్ కంపెనీ లిమిటెడ్ (ఇఐపిఎల్) ఆయిల్ ట్యాంక్‌పై ఆదివారం పిడుగుపడింది. దీంతో, ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. పక్కనే హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ కూడా ఉండడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన అందరినీ వెంటాడింది. కంపెనీ యాజమాన్యం ఫైర్ సైరన్‌ను మోగించడంతో హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ అగ్నిమాపక శకటాలు హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశాయి. ప్రమాద విషయం తెలుసుకున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఎసిపి కాళిదాసు, సిఐ గొలగాని అప్పారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

శిశు మరణాల రేటులో అత్యంత తక్కువ స్థాయికి కేరళ

- అమెరికాలో 5.6% కంటే దిగువకి కేరళలో 5% తక్కువ

తిరువనంతపురం: కేరళ రాష్ట్రంలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) అత్యంత తక్కువ స్థాయికి చేరుకుంది. ప్రతి వేయి శిశ జననాలకు కేవలం 5 మరణాలు మాత్రమే నమోదవుతున్నాయని శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేధిక తెలిపింది.. ఈ రేటు అమెరికా కంటే కూడా తక్కువ. దేశ సగటు కంటే దాదాపు ఐదు రెట్లు తక్కువ. భారత్‌లో శిశు మరణాల రేటు సగటు 25% ఉండగా, కేరళలో అది కేవలం 5% మాత్రమే. అమెరికాలో ఈ రేటు 5.6% ఉండగా, కేరళ దాన్ని దాటేసింది. ఇది కేరళ వైద్య రంగంలో సాధించిన అపూర్వ విజయమని ఆ రంగ నిపుణులు తెలుపుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇదే స్థాయిలో మెరుగుదల నమోదయింది. తల్లి, పిల్లల ఆరోగ్య సేవల్లో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని అధికారులు తెలిపారు. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మార్టాలిటి) కూడా 4% కంటే తక్కువకు చేరుకుంది. దేశ సగటు 18% ఉండగా, కేరళలో ఇది అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకుంది. ఇది కేరళ వైద్య రంగం ఎంత అభివృద్ధి చెందిందో చూపిస్తుంది. ఈ విజయానికి అనేక కారణాలు ఉన్నాయి. పుట్టిన వెంటనే పిల్లలకు పూర్తి వైద్య పరిక్షలు చేయడం. అన్ని ఆసుపత్రుల్లో అత్యుత్తమ వైద్య సౌకర్యాలు, పిల్లల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక పథకాలు. గ్రామ స్థాయిలో ఆరోగ్య కార్యకర్తల చురుకైన పాత్ర వహిస్తున్నాయి. కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అక్షరాస్యత, టీకాలు, ప్రత్యేక వైద్య కార్యక్రమాలు వంటి బహుముఖ వ్యూహంతో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పుట్టుకతో వచ్చే గుండె లోపాలను చికిత్స చేయడానికి ప్రత్యేక కార్యక్రమం నడుపుతున్నామని, కేరళ ప్రభుత్వం ఈ రేటును మరింత తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందని, అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకుంటామని ఆమె తెలిపారు.

కొనసాగుతోన్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

- 20వ రోజుకు చేరినా స్పందించని ఛత్తీస్‌గఢ్ సర్కారు
- అత్యవసర వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 14వేల మంది కాంట్రాక్టు సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు చేసిన విషయం కూడా విదితమే. అయినప్పటికీ అక్కడి బిజెపి సర్కారులో మాత్రం ఎలాంటి చలనమూ కనబడటం లేదు. దీంతో రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగు తున్నది. విద్యా సంస్థలలో వైద్య పరీక్షలు జరగటం లేవు. ఫలితంగా రోగులు, రోగుల బంధువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోని బిజెపి

25 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తూ అక్కడి బిజెపి సర్కారు ఉత్తర్వుల్విటం, ప్రభుత్వ చర్యను తప్పుపడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 14 వేల మంది కాంట్రాక్ట్ సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించటం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉద్యోగులు ప్రారంభించిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత నెల 18న ఆందోళన ప్రారంభించారు. తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలనీ, మెరుగైన వేతనాలు అందించాలనీ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని వారు ప్రధానంగా కోరుతున్నారు. ఉద్యోగుల పది డిమాండ్లలో నాలుగింటిని ఎన్‌హెచ్‌ఎం ఎగ్జిక్యూటివ్ కమిటీ గత నెల 13న ఆమోదించిందని అధికారులు చెబుతుండగా.. నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదని ఉద్యోగ సంఘం ఆరోపించింది. సమ్మెను కొనసాగించాలన్న యోచన తమకేమీ లేదనీ, అయితే ప్రభుత్వం చర్చలకు అవకాశం కల్పించడం లేదని ఉద్యోగాన్ని కోల్పోయిన హేమంత్ కుమార్ సిన్హా చెప్పారు. కాంట్రాక్ట్ ఆరోగ్య కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని 2023 శాసనసభ ఎన్నికల మ్యానిఫెస్టోలో బిజెపి హామీ ఇచ్చిందని ఎన్‌హెచ్‌ఎం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అమిత్ మిరి గుర్తు చేశారు. ఇది ప్రధాని మోడీ ఇచ్చిన గ్యారంటీ అని కూడా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచిన తర్వాత కూడా తమ గోడును ఎవరూ పట్టించుకోలేదని డాక్టర్ మిరి వాపోయారు. ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి, ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలకు 160కి పైగా వినతి పత్రాలు అందించామని, విధిలేని పరిస్థితులలో నిరసన చేపట్టాలని 16 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిర్ణయించారనీ, సమ్మె కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా ఉద్యోగుల సమ్మె విషయంలో ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందనీ, నిరసనకారులపై లాఠీఛార్జీ చేయిస్తూ అగ్నికి ఆజ్యం పోస్తోందని రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. వారి డిమాండ్లను నెరవేర్చాలని తెలిపింది.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు మహా కూటమిలోకి మరో రెండు పార్టీలు

పాట్నా : బీహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. తాజాగా ప్రతిపక్ష మహా కూటమిలోకి మరో 2 పార్టీలు వచ్చి చేరాయి. హేమంత్ సోరేన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), పసుపతి పరాస్ నేతృత్వంలో ఎల్‌జెపి మహాకూటమిలోకి వచ్చాయి. ప్రస్తుతం మహా కూటమిలో ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ సహా 6 పార్టీలు ఉన్నాయి. తాజాగా చేరిన రెండు పార్టీలతో కలిసి మొత్తం 8 పార్టీలు మొత్తం 243 సీట్లను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. పసుపతి పరాస్ (ఎల్‌జెపి) రాకతో పాసవాన్ చెందిన ఓట్లను రాబట్టుకోవడానికి మహాకూటమి అనుకూలంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. దీంతో ఖగారియా ప్రాంతంలో పరాస్ వర్గానికి రెండు లేదా మూడు సీట్లు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే, జార్ఖండ్‌లోని ప్రభుత్వంలో కాంగ్రెస్, ఆర్‌జెడి భాగస్వాములుగా ఉన్నందున బీహార్‌లో జెఎంఎంకు కనీసం ఒక్క సీటైనా కేటాయించాల్సిన అవసరం ఉంది. బంకా, ముంగర్, భాగల్‌పుర్ స్థానాల్లో ఏదో ఒక సీటును జేఎంఎంకు కేటాయించే అవకాశం ఉంది.

ట్రంప్ సలహాదారు నావారో భారత్‌పై మరోసారి తీవ్ర వాఖ్యలు

వాషింగ్టన్ డీసీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వాణిజ్య సలహాదారుడు పీటర్ నావారో శనివారం భారతదేశంపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో " భారతదేశం రష్యన్ చమురు కేవలం లాభం కోసమే కొంటుంది. రష్యా ఉక్రెయిన్ దాడి చేయకముందు ఎప్పుడూ కొనలేదని నావారో ఆరోపించారు..ఇటీవలే వాషింగ్టన్ పోస్ట్ వార్తా కథనంలో ట్రంప్ పరిపాలనలో భారత్-అమెరికా సంబంధాలపై విభేదాలు ఉన్నాయన్నారు. భారతదేశం వల్ల అమెరికన్ల ఉద్యోగాలు పోతున్నాయన్నారు. నవారో తరచుగా భారత్‌ను టార్గెట్ చేస్తూ విమర్శిస్తున్నారు. అయితే బుధవారం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ నావారో వాఖ్యలను ఖండించారు. నావారో చేసిన తప్పుడు, మార్గదర్శకత లేని వాఖ్యలను మేము తిరస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు నవారో పోస్ట్‌పై ఎక్స్ ఫ్యాక్ట్ చెక్ చేసింది. ఇది తప్పుడు వార్తాగా తేల్చింది. దీనిపై కూడా నవారో మండిపడ్డారు . ఎక్స్‌లో మస్క్ అమెరికా వ్యతిరేక ప్రచారానికి అనుమతిస్తున్నారంటూ రాసుకొచ్చారు...

రేపు ఉపరాష్ట్రపతి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి), రాజ్యసభకు నామినేటెడ్ 12 మంది సభ్యులు, లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులు (ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది) ఉంటారు. ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 788 మంది సభ్యులు ఉండగా, ప్రస్తుతం 781 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సంఘ్ పరివార్ నేత వర్సెస్ న్యాయకోవిదుడు

సి.పి రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన సంఘ్ పరివార్ నేత. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. 2011 జులైలో సుప్రీంకోర్టు నుంచి పదవీ విరమణ చేసిన సుదర్శన్ రెడ్డి (79) నల్లధనం కేసుల దర్యాప్తులో అలసత్వం చూపినందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ అనేక మైలురాయి తీర్పులకు ప్రసిద్ధి చెందిన అనుభవజ్ఞుడైన న్యాయనిపుణుడు. మావోయిస్టులతో పోరాడటానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నియమించిన సల్వా జుడుమ్‌ను ఆయన నేతృత్వంలోని ధర్మాసనం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ తీర్పును సాకుగా చూపుతూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై మావోయిస్టు ముద్ర వేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. విదేశాల్లోని బ్యాంకు ఖాతాల్లో చట్టవిరుద్ధంగా దాచిన లెక్కల్లో లేని డబ్బును తిరిగి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చింది కూడా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనమే. పౌర హక్కులు, దేశ ప్రయోజనాలను కాపాడిన వ్యక్తిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత ఎంపీలందరిపైనా ఉందని ఇండియా బ్లాక్ పిలుపునిచ్చింది.

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం,
కష్టపడి తెచ్చుకున్న అవకాశం,
ఓటమి తర్వాత వచ్చే అనుభవం,
గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం
ఎప్పటికీ వృథా పోవు.

మీ కోసం

మరుగుతున్న సాంబారులో ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.



చీమల పాఠం




మధ్యాహ్న భోజన సమయం కాగానే విద్యార్థులందరూ గుంపులు గుంపులుగా తమ ప్లేట్లతో భోజన నిర్వాహకుల వద్దకు వచ్చారు. భోజనం వడ్డించే వారికి ఇది చాలా కష్టతరంగా ఉంది. ఇది గమనించిన తెలుగు మాస్టారు పిల్లలందరినీ పక్కకి రమ్మని పిలిచారు. పిల్లలని కొద్ది దూరం తీసుకెళ్ళి చీమల పుట్టలు పరిశీలించమన్నారు. తెలుగు మాస్టారు ఏం చేస్తున్నారో విద్యార్థులకు అర్థం కాలేదు.

పిల్లలతో తెలుగు మాస్టారు మాట్లాడుతూ 'చూడండి పిల్లలూ, పుట్ట నుండి వెళ్తున్న చీమలను ఒక్కసారి పరిశీలించండి. ఒకదాని తర్వాత ఒకటి చక్కగా వరస క్రమంలో వెళ్తున్నాయి. అలా వెళ్ళమని వాటికి ఎవరూ చెప్పలేదు. అయినా ఎంతో క్రమశిక్షణగా ఒకదాని వెనక మరొకటి వెళుతున్నాయి. చీమలు మనకు చెప్పే పాఠం ఇదే. కానీ మీరేమో భోజనం వద్ద గుంపులు గుంపులుగా చేరుతున్నారు. అది వడ్డించే వారికి ఎంత ఇబ్బందో అర్థం చేసుకోండి. మీరు వరుసగా నిలబడితే, ఆహారం వధా కాకుండా భోజనం అందరికీ అందుతుంది' అని చెప్పగానె విద్యార్థులందరూ సిగ్గుతో తల దించుకున్నారు. ఆనాటి నుండి విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడానికి వరుస కట్టి నిలబడడం అలవాటు చేసుకున్నారు. పిల్లల్లో వచ్చిన మార్పు చూసి తెలుగు మాస్టారు సంతోషించారు.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్,
94417 62105.

సరైన పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చాం. ఇంగ్లీషులో వాటిని ఏమంటారో కింద ఇచ్చిన గళ్లల్లో రాయండి. బాణం గుర్తు పెట్టిన బాక్సుల్లో ఉన్న అక్షరాలను కింద ఇచ్చిన బాక్సులో వరుసగా రాసి చూడండి.



నేను గీసిన బొమ్మ






వై. అంజలి,
6వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
పి.నైనవరం,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆధునిక వైద్యంతో నొప్పులు మటుమాయం

నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

ఫిజియోథెరపీ అనేది శారీరక చికిత్స, గాయం, అనారోగ్యం లేదా వైకల్యం వల్ల కలిగే నొప్పిని తగ్గించడానికి, కదలికను మెరుగుపరచడానికి, పనితీరును పెంచడానికి సహాయపడుతుంది. ఫిజియోథెరపిస్టులు వ్యాయామాలు, వేడి, చలి, విద్యుత్ ప్రవాహాలు, అల్ట్రాసౌండ్ వంటి వివిధ చికిత్సా పద్ధతులను ఉపయోగిస్తారు. శస్త్రచికిత్స అనంతర పునరావాసం, క్రీడా గాయాలు, దీర్ఘకాలిక పరిస్థితులు, కండరాల బలహీనత వంటి అనేక రకాల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి.



ఫిజియోథెరపీ రోగి కేవలం కోలుకోవటానికి మాత్రమే పరిమితం కాదు. ఆరోగ్య సమస్యలను నివారించటంతోపాటుగా ఆయా సమస్యలకు మూలకారణాలను పరిష్కరించడానికి దోహదపడుతుంది. దీర్ఘకాలిక నొప్పులకు పరిష్కారాలను చూపుతుంది. నొప్పులను క్రమేపి తగ్గించటం ద్వారా గతం కంటే మెరుగైన ఆరోగ్యం, జీవన శైలి కొనసాగేలా జీవన నాణ్యతను పెంచేలా ఈ వైద్య విధానం దోహదపడుతుంది. ఆర్థ్రైటిస్ (ఆస్టియో ఆర్థ్రైటిస్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్), ఆస్టియో పోరోసిస్, కీళ్లనొప్పి, దృఢత్వం, మోకాలినొప్పి, వెన్నునొప్పి, కండరాల బలహీనత, క్షీణత వంటి సమస్యలకు పరిష్కారం చూపుతుంది. నాడీ సంబంధితమైన పార్కిన్సన్స్ వ్యాధి, స్ట్రోక్ పునరావాసం, చిత్త వైకల్యానికి సంబంధించిన కదలిక సమస్యలు, మల్టీపుల్ స్లీరోసిస్, న్యూరోపతి (నరాలనొప్పి), చేతులు, కాళ్లల్లో జలదరింపు వంటి సమస్యలు తగ్గుతాయి.

వయస్సు పెరిగే కొద్దీ ఆర్థ్రైటిస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. నిర్లక్ష్యం చేయకుండా ఫిజియోథెరపిస్టుల ద్వారా చికిత్సలు పొందితే ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతోపాటుగా పూర్తిగా జీవించటానికి మంచి బలం, ఆరోగ్య సమతుల్యత, వ్యక్తిగత ఆరోగ్యంపై విశ్వాసం వంటివి పెరుగుతాయి.

ఏటేటా అవగాహనా కార్యక్రమాలు

1996లో ప్రపంచ ఫిజియోథెరపీ సంస్థ, వరల్డ్ ఫిజియో థెరపీ ద్వారా సెప్టెంబర్ 8వ తేదీన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా ప్రకటించారు. 1951 సెప్టెంబర్ 8న యునైటెడ్ కింగ్‌డమ్‌లో స్థాపించబడిన వరల్డ్ ఫిజియోథెరపీ ఒక లాభాపేక్షలేని సంస్థ. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 6 లక్షల కంటే ఎక్కువ ఫిజియోథెరపిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇందులో 120 సభ్య సంస్థలు ఉన్నాయి. వరల్డ్ ఫిజియోథెరపీ సంస్థ సరసమైన ఆరోగ్య సంరక్షణను అందించటానికి ఆధారాల ఆధారిత ఫిజియోథెరపీ అభ్యాసాన్ని ప్రోత్సహించటంలో ఫిజియోథెరపిస్టులకు సురక్షితమైన పని విధానాలను సమర్థిస్తుంది.



వృద్ధులకు తోడుగా...

ఈ ఏడాది 'వృద్ధాప్యంలో శారీరక బలహీనతలు-అకస్మాత్తుగా పడిపోవటాన్ని నివారించటంపై ప్రత్యేక దృష్టి' పేరుతో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రపంచ జనాభాలో 2019 నాటికి దాదాపు 1 బిలియన్ మంది 60 సంవత్సరాలపైబడిన వారు ఉన్నారు. 2030 నాటికి 1.4 బిలియన్లు, 2050 నాటికి 2 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. 2050 నాటికి 80 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి సంఖ్య మూడురెట్లు పెరిగి 426 మిలియన్లకు చేరుకుంటుంది. ఎక్కువ మంది వృద్ధులు ఉండబోతున్నందున వారిలో చలనశీలత బలం తగ్గకుండా ఉండటానికి ఫిజియోథెరపిస్టుల అవసరం ఉంటుంది.

నొప్పులకు మోక్షం...

ఆర్థ్రైటిస్, వెన్నునొప్పి, మెడ నొప్పి, బెణుకు లేదా స్ట్రెయిన్, క్రీడా గాయాలు, ఎముకల కీళ్ల కండరాల, గుండె, ప్రసరణ సమస్యలు, అధిక రక్తపోటు, గుండెపోటు తర్వాత కోలుకోవడం, స్ట్రోక్ తర్వాత కదలడంలో సమస్యలు, మల్టిపుల్ స్లీరోసిస్ లేదా పార్కిన్సన్స్ వ్యాధి వంటి పరిస్థితి ఉంటే దీర్ఘకాలిక అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సిఒపిడి) వంటి పరిస్థితుల వల్ల కలిగే సమస్యలు. గర్భధారణ సమయం తర్వాత మూత్ర విసర్జన, మలం లీక్ కావడం (ఆపుకొనలేని స్థితి) వంటి సమయాల్లో శస్త్ర చికిత్సలు జరుగుతుంటాయి. చికిత్సల తర్వాత కదలిక, బలం, శక్తిని మెరుగుపర్చటంలో సహాయపడటానికి ఫిజియోథెరపీని తరచుగా ఉపయోగిస్తారు. పిల్లలు, వృద్ధులతో సహా అన్ని వయసుల వారికి ఫిజియోథెరపీ చేయొచ్చు.

పద్ధతులు ఇవే...

వివిధ పరిస్థితులు, రోగి సమూహాల అవసరాలను తీర్చడానికి ఫిజియోథెరపిలో ప్రత్యేకమైన ఆర్థోపెడిక్, న్యూరాలజీ కార్డియోథొరాసిక్, స్పోర్ట్స్ ఇంజూరీస్, పీడియాట్రిక్, గైనిక్ ఫిజియోథెరపీ, జీరియాట్రిక్స్ లాంటి చికిత్సా విధానాలు ఉన్నాయి. వ్యాయామాలు, మాన్యువల్ థెరపీ, ఎలక్ట్రోథెరపి, అధునాతన పద్ధతులు వేగంగా రోగి కోలుకోవటానికి, సమస్యను నివారించటానికి సహాయపడుతుంది.

వ్యాయామ చికిత్సలు

స్ట్రెంత్ ట్రైనింగ్ : జాయింట్ స్టెబిలిటీకి మజిల్ కండరాల శక్తిని పెంచుతుంది.

బ్యాలెన్స్, కోఆర్డినేషన్ వ్యాయామాలు : పడిపోకుండా నిరోధించటానికి, మొత్తం శరీరాన్ని నియంత్రణను మెరుపర్చటానికి దోహదపడుతుంది.

స్ట్రెచ్చింగ్ ఎక్సైర్‌సైజ్ : కండరాల బిగుతును సాగదీయటం, మొబిలిటీని పెంచటానికి దోహదపడుతుంది.

బోన్ సెట్టింగ్ : ఎముకల అమరికను సరిచేయటానికి వెన్నుపాముపై ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఎలక్ట్రో థెరపీ : నొప్పిని తగ్గిచడం, కండరాలు, నరాల కదలికను మెరుగుపర్చటానికి ఉపయోగపడుతుంది.

డ్రై నీడ్లింగ్ థెరపీ : నొప్పిని తగ్గించటానికి, కండరాల బిగుతును తగ్గించటానికి దోహదపడుతుంది.

మాన్యువల్ థెరపీ : జాయింట్ మొబలైజేషన్ నొప్పిని తగ్గించటానికి (హాండ్సన్ ట్రీట్మెంట్) చేతితో చేసే పద్ధతులు.

ఫిజియోథెరపీ స్పెషాలిటీస్ :

ఆర్థోపెడిక్ : ఎముకలు, కీళ్లు, కండరాలు, గాయాల తర్వాత వచ్చే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి కోలుకోవటానికి దోహదపడుతుంది.

న్యూరో : మెదడు, వెన్నుపాము, స్ట్రోక్ మల్టీపుల్ స్కీరోసిస్, వెన్నుపాము గాయాలతో బాధపడుతున్న వారికి కండరాల బలాన్ని మెరుగుపర్చటానికి ఉపయోగపడుతుంది.

కార్డియో పల్మనరీ : నియోనియా లేదా శస్త్ర చికిత్స ద్వారా ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపర్చటానికి హార్ట్ సర్జరీ తర్వాత కాంప్లికేషన్స్ రాకుండా ఊపిరితిత్తుల శక్తిని పెంచటానికి ఉపయోగపడుతుంది.

గైనిక్ : నార్మల్ డెలీవరీలు ప్రీనేటల్, పోస్ట్‌నేటల్ వ్యాయామాల ద్వారా నార్మల్ స్థితికి రావటానికి దోహదపడుతుంది.

పీడియాట్రిక్స్ : పిల్లల్లో వచ్చే ఎదుగుదల లోపాలకు, సెరిబ్రల్ పాల్సీ వంటి సమస్యలు తగ్గుతాయి.

జెరియాట్రిక్స్ : వృద్ధుల్లో వచ్చే దీర్ఘకాలిక సమస్యలు నడుము నొప్పి, మోకాళ్లనొప్పి సరిగ్గా నడవలేకపోవటం, బ్యాలెన్స్ లేకపోవటం వంటి సమస్యలకు ఫిజియోథెరపీ దోహదపడుతుంది.



-డాక్టర్ దుబ్బ నాగరాజు,
ఎంపిటి ఆర్థోపెడిక్స్,
పిహెచ్‌డి స్కాలర్
అసోసియేట్ ప్రొఫెసర్
ఫిజియోథెరపీ విభాగం
ఎన్ఆర్ఐ జనరల్ ఆసుపత్రి,
మంగళగిరి, గుంటూరు జిల్లా.
సెల్ : 9703212170

గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం 'ఘాటీ'..

సమాజంలో జరిగే మంచీ, చెడులను గురించి దృశ్యరూపంలో చూపించే మాధ్యమం సినిమానే. అలాంటి సినిమాలు సమాజాన్ని చైతన్యపర్చటానికి ఎంతో దోహదపడతాయి. స్థానికత, వాస్తవికతకు అతి దగ్గరలో తీసిన సినిమా 'ఘాటీ'. తెలుగు సినిమాల్లో సమాజాన్నీ, మనిషి జాడనీ ఆవిష్కరించే కథలు అడపాదడపా మాత్రమే వస్తున్న క్రమంలో దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన సినిమా ఇది. 'చెప్పే కథ ఎంత స్థానికంగా ఉంటే..దానికంత ప్రపంచ ఆదరణ' అంటూ 'కాంతార' దర్శకుడు రిషబ్ చెప్పిన విషయం అక్షర సత్యంగానే అనిపిస్తోంది. ఇటీవల కాలంలో మట్టిపరిమళాలు పులుముకొని వెండితెరపై గుబాళించిన పలు చిత్రాలు విజయాన్ని సాధించాయి. అదేకోవలో ఈనెల ఐదోతేదీన విడుదలైన 'ఘాటీ' సినిమా కూడా ప్రేక్షకాదరణతో ముందుకు సాగుతోంది. ప్రఖ్యాత రచయిత, ఘాటీ సినిమా కథకుడు చింతకింది శ్రీనివాసరావు తాను రాసిన కథే 'ఘాటీ' చిత్రంగా తెరకెక్కింది. శుక్రవారం విడుదలైన ఈ సినిమాతో గంజాయి మహమ్మారిపై చర్చలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. మనిషి కేంద్రంగా నడిచే సమాజం మానవత్వంతో వ్యవహరించినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయనే ఇతివృత్తంతో ఈ కథ ఆద్యంతం సాగుతుంది. సాహితీ రంగంలో రచయితగా కొనసాగుతున్న చింతకింది శ్రీనివాసరావును 'అరేబియా కడలి' వెబ్ సిరీస్ ద్వారా తెలుగు తెరకు క్రిష్ పరిచయం చేశారు. అంతేకాదు ఆ సిరీస్‌లో 'ముఖలింగం' అనే ప్రధాన పాత్ర ద్వారా ఆయన నటుడిగా ప్రపంచవ్యాప్తంగా





గుర్తింపు పొందారు. ఇప్పుడు 'ఘాటీ' చిత్ర కథకుడుగా వెండితెరకు చేరువై మంచి సినిమా కథా రచయితగా అభినందనలు పొందుతున్నారు.

కథ ఎంపికే గర్వకారణం


గంజాయి మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తున్న విషయం తెలిసిందే. విద్యాలయాల్లో కూడా ఇది చొచ్చుకుపోయి తూలుతూ, ఊగుతూ కొందరు పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళుతుండటంతో ఎవ్వరూ ఏమి చేయలేని దుస్థితి. ప్రభుత్వాలు కూడా అంతస్థాయిలో దృష్టి పెట్టలేని పెద్ద సమస్యతోపాటుగా సవాల్. ఇలాంటి సున్నిత సమస్యపై చింతకింది శ్రీనివాసరావును నమ్మి ఆయన రచించిన కథను క్రిష్ చిత్రంగా మలచటం, స్క్రీన్‌ప్లే చాలా బాగా వచ్చింది. పుష్ప సిరీస్ స్థాయిలో ఆద్యంతం ఉత్కంఠ మధ్యలో కథ ముందుకు సాగుతుంటుంది.

కథ ఏమిటంటే...

ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దులో శీలవతి గంజాయి రకం పెరుగుతుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా చాలా డిమాండ్ ఉంది. వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. గంజాయి బస్తాలను మోయడానికి కొంతమంది వ్యక్తులు పనిచేస్తుంటారు. తూర్పుకనుమల్లో ఉండే ఆ పేదలు కొండల్లో గంజాయి సాగు చేస్తూ, క్లిష్టమైన లోయ ప్రాంతాల నుంచి మోసుకొచ్చి, రవాణా అనువుగా వున్న ప్రాంతానికి దాన్ని తరలిస్తూ ఉంటారు. పోలీసు నిర్బంధం ఉన్నా సాహసోపేతంగా పనిచేస్తూ ఈ పనిలో ప్రాణాలు కూడా కోల్పోయిన వారూ ఉంటారు. వాళ్లకు బతకడానికి ఈ పని తప్ప ఇంకొకటి చేతకాదు. కోట్ల రూపాయల వ్యాపారాన్ని నాయుడు బ్రదర్స్ నడిపిస్తుంటారు. ఘాటీలు పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే కాపాడుతారు. చనిపోతే డబ్బులిస్తారు. ఘాటీల తెగకే చెందిన శీలావతి (అనుష్క) దేశిరాజు (విక్రమ్ ప్రభు) కలిసి తమ వారి బాగు కోసం ఏమి చేశారు? గంజాయి స్మగ్లింగ్‌ని ఎలా మాన్పించారు? అనేది కథ సారాంశం. తొలుత ఘాటీల వివరణలతో సినిమా ప్రారంభమవుతుంది. గంజాయి నిరోధించే అధికారిగా జగపతిబాబు రంగంలోకి దిగి శీలావతి రకం గంజాయిని ద్రవరూపంలో అక్రమంగా రవాణా చేస్తున్నారని పసిగడతాడు. తమకి తెలియకుండా ఈ ఆపరేషన్ ఎలా జరుగుతూ వుందని నాయుడు బ్రదర్స్ (రవీంద్ర విజయ్, చైతన్యరావ్) ఆరా తీస్తే చాలా కొత్త విషయాలు తెలుస్తాయి. బస్ కండక్టర్‌గా పని చేస్తున్న అనుష్క, ల్యాబ్ టెక్నీషియన్‌గా వున్న విక్రమ్ ప్రభు కలిసి కొండ గుహల్లో స్థావరం ఏర్పాటు చేసుకుని లిక్విడ్ గంజాయి తయారుచేసి స్మగ్లింగ్ చేస్తుంటారు. ఈ రకంగా సంపాదించిన కోట్లాది రూపాయల డబ్బుతో ఘాటీల పిల్లలకి స్కూళ్లు, ఆస్పత్రులు ఏర్పాటు చేస్తుంటారు. కనుమల్లో పండే గంజాయి పంటను ఘాటీ కూలీలు పోలీసుల కంట పడకుండా అక్రమంగా నాయుడు సోదరుల అడ్డాకు చేరవేస్తే.. దాన్ని వాళ్లు తమ బాస్ మహవీర్ (జిషు సేన్ గుప్తా)కు పంపుతారు. అతని కార్టెల్ దాన్ని దేశ విదేశాలకు అక్రమ మార్గాల్లో ఎగుమతి చేసి సొమ్ము చేసుకోవడం పరిపాటి. అయితే ప్రాణాలకు తెగించి గంజాయిని అక్రమ రవాణా చేసే ఘాటీలకు కష్టానికి తగ్గ ఫలితం, గౌరవం దక్కకపోవడంతో ఆ తెగకు చెందిన దేశిరాజు (విక్రమ్ ప్రభు) ఓ ఆలోచన చేస్తాడు. తన మరదలు శీలావతి (అనుష్క)తో పాటు తోటి ఘాటీలతో కలిసి ఓ కొత్త దందాకు తెర లేపుతాడు. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి దేశ విదేశాలకు ఎగుమతి చేయడం మొదలు పెడతారు. అయితే ఈ విషయం నాయుడు సోదరులకు తెలియడంతో ఘాటీలను అంతమొందించేందుకు సిద్ధమవుతారు.

స్క్రీన్‌ప్లే అదుర్స్

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని తూర్పు కనుమలు, అక్కడి ఎత్తయిన పర్వతాలు, కొండలు, గుట్టలు, ఇతర ప్రాంతాల గురించి స్క్రీన్ ప్లే బాగా వచ్చింది. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ అన్ని అంశాల మేళవింపు, కూర్పు, స్క్రీన్‌ప్లే, సౌండింగ్, గ్రాఫిక్స్, కథ గమనం ఆద్యంతం ఆసక్తిగానూ, ఉత్కంఠతతో ముందుకు సాగింది. తమ తెగలోని జీవితాల్ని బాగు చేసుకోవాలనే సంకల్పంతో దేశిరాజు-శీలావతి కలిసి మొదలు పెట్టిన ఆ వ్యాపారం వాళ్లని ఎన్ని చిక్కుల్లో పడేసింది. ఈ క్రమంలో తనకు జరిగిన అన్యాయంపై నాయుడు సోదరులతో శీలావతి పోరాడటం మొత్తం కథ రూపం. బ్లాక్‌బస్టర్ చిత్రాల



దర్శకుడిగా తన సత్తాను క్రిష్ చూపారు. అనుష్క తనదైన శైలితో పోరాట దృశ్యాల్లో నటించి మెరుగైన నట ప్రదర్శనను ఇచ్చారు. సమాజంలో యువత జీవితాలపై చెడు ప్రభావాన్ని చూపుతున్న గంజాయిని రూపుమాపాలన్న సందేశంతో తీసిన ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకుల ఆదరణను పొందుతోంది. చిత్ర కథకుడు చింతకింది శ్రీనివాసరావు తన కథతో గంజాయి సామ్రాజ్యం గురించి బయట ప్రపంచానికి తెలియజేసేలా చేయటం అభినందనీయం.

ఛాంపియన్ సబలెంక

- టైటిల్ నిలుపుకున్న బెలారస్ స్టార్
- ఫైనల్లో ఆమందకు భంగపాటు
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



యుఎస్ ఓపెన్ టైటిల్‌తో సబలెంక

న్యూయార్క్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో పరాజయం. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ ఓటమి. వింబుల్డన్‌లో సెమీస్‌లోనే చుక్కెదురు. అయినా, అరినా సబలెంక (బెలారస్) పట్టు వదల్లేదు. యుఎస్ ఓపెన్‌లో రెట్టించిన పట్టుదలతో బరిలోకి దిగింది. న్యూయార్క్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ ఆమంద అనిషిమోవపై 6-3, 7-6(7-3)తో సబలెంక సూపర్ విజయం సాధించింది. 2014 తర్వాత మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్ నిలుపుకున్న క్రీడాకారిణిగా సబలెంక నిలిచింది. వింబుల్డన్ ఫైనల్లో 0-6, 0-6తో స్వైటెక్ చేతిలో భంగపడిన ఆమంద అనిషిమోవ.. సొంతగడ్డపై గట్టి పోటీనిచ్చింది. వరల్డ్ నం.1 సబలెంకకు అంత సులువుగా టైటిల్‌ను వదులుకోలేదు. గంటన్నరకు పైగా సాగిన టైటిల్ పోరులో అనిషిమోవ 4 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. సబలెంక ఓ ఏస్‌తో సరిపెట్టినా.. ఆమంద సర్వ్‌ను ఐదు సార్లు బ్రేక్ విజేతగా నిలిచింది. ఆమంద 22 విన్నర్లు కొట్టగా.. సబలెంక 13 విన్నర్లే కొట్టింది. పాయింట్ల పరంగా 76-59తో సబలెంక పైచేయి సాధించింది. సబలెంక 15 అనవసర తప్పిదాలు చేయగా.. ఆమంద 29 అనవసర తప్పిదాలతో టైటిల్‌ను చేజార్చుకుంది. సబలెంక బలమైన సర్వ్, ఫోర్‌హ్యాండ్ ర్యాలీలను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఆమంద.. తొలి సెట్లో మూడు సార్లు సర్వ్‌ను కోల్పోవటం దెబ్బతీసింది. రెండో సెట్లో 5-4తో మ్యాచ్ పాయింట్ ముంగిట నిలిచిన సబలెంకను నిలువరించిన ఆమంద.. ఆ సెట్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లింది. టైబ్రేకర్‌లో సబలెంక ఒత్తిడిలో అద్భుతంగా రాణించింది. టైబ్రేకర్‌ను తప్పక నెగ్గాల్సిన ఆమంద ఒత్తిడికి తట్టుకుని నిలువలేదు. ఫలితంగా వరుస సెట్లలో లాంఛనం ముగించిన సబలెంక మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది.



రన్నరప్ టైటిల్‌తో ఆమంద అనిషిమోవ

పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆరో సీడ్ నీల్, జో ద్వయం, మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ ఎరిన్, గాబ్రియెల జోడీలు విజేతలుగా నిలిచారు.

బావోద్వేగ విజయం!

ఈ ఏడాది అరినా సబలెంక సూపర్ ఫామ్ కొనసాగినా గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌లో అది ప్రతిబింబించలేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ సహా వింబుల్డన్‌లో సబలెంకకు అమెరికా అమ్మాయిలే చెక్ పెట్టారు. మెల్‌బోర్న్‌లో మడిసన్ కీస్.. పారిస్‌లో కొకొ గాఫ్.. వింబుల్డన్‌లో ఆమంద అనిషిమోవలు సబలెంకను ఓడించారు. యుఎస్ ఓపెన్‌లోనూ అమెరికా అమ్మాయే సబలెంకకు సవాల్ విసిరింది. సమర్థవంతంగా ఎదుర్కొన్న సబలెంక ఈ ఏడాది తొలి టైటిల్‌ను, కెరీర్ నాల్గో గ్రాండ్‌స్లామ్ విజయాన్ని అందుకుంది.

పసిడి బాణం

- మెన్స్ జట్టుకు స్వర్ణ పతకం
- జ్యోతి సురేఖ, రిషబ్‌లకు సిల్వర్
- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్స్



జ్యోతి సురేఖ, రిషబ్

గాంగ్జు (దక్షిణ కొరియా) : ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో భారత పురుషుల జట్టు చరిత్ర సృష్టించింది. గతంలో భారత మహిళల, మిక్స్‌డ్ జట్లు స్వర్ణ పతకాలు సాధించినా.. పురుషుల జట్టు పసిడి నెగ్గటం ఇదే ప్రథమం. రిషబ్ యాదవ్, ఆమన్ సైని, ప్రతమేశ్ త్రయం పురుషుల కాంపౌండ్ విభాగం ఫైనల్లో బంగారు పతకం సాధించారు. ఫ్రాన్స్‌తో ఫైనల్లో తొలి మూడు సెట్ల అనంతరం స్కోరు 176-176తో సమమైంది. నిర్ణయాత్మక రౌండ్లో సమిష్టిగా మెరిసిన భారత ఆర్చర్లు 59 పాయింట్లు సాధించగా.. ఫ్రాన్స్ 57 పాయింట్లే చేసింది. దీంతో 235-233తో భారత్ బంగారు పతకం సాధించింది. తొలుత కాంపౌడ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో తెలుగమ్మాయి జ్యోతి సురేఖతో కలిసి రిషబ్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించాడు. నెదర్లాండ్స్‌తో ఫైనల్లో 155-157తో జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్‌లు రెండు పాయింట్ల తేడాతో పసిడి పతకం చేజార్చుకున్నారు.

ఈ నెల 22 నుంచి సూపర్ కప్

న్యూఢిల్లీ : భారత ఫుట్‌బాల్ సీజన్ ఈ నెల 22 నుంచి పున ప్రారంభం కానుంది. దశల వారీగా జరుగనున్న సూపర్ కప్ నవంబర్ 22న ముగియనుంది. ఆ తర్వాత ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఆరంభం కానుంది. భారత ఫుట్‌బాల్ టోర్నమెంట్ల కమర్షియల్ భాగస్వామి ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని నియమిస్తూ ఎఐఎఫ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68